ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -108 బుధవారం 5 ఆగస్టు 2026

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



'అమరజీవి జలధార' గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు పరిష్కారం: పవన్ కల్యాణ్

జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు

తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం

నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్

**అమరావతి ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**
జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు**మిగతా 2లో...**

# రెండేళ్ల పాలనపై ప్రగతి నివేదిక..

### ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ ప్రొగ్రెస్ రిపోర్ట్ విడుదల చేసిన సీఎం

2019-24 మధ్య గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శ

నిశ్శబ్ద విప్లవంతో ప్రజలు 57 శాతం ఓట్లతో తమను గెలిపించారని వెల్లడి

గత పాలనలో ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ.. పారిశ్రామికవేత్తలు పారిపోయారని ఆరోపణ

ఉత్తరాంధ్రలో ఇరిగేషన్, స్టీల్, ఐటీ, ఫార్మా రంగాలను అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ



**అమరావతి ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**
తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'ప్రొగ్రెస్ రిపోర్ట్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 2019-24 మధ్య కాలంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని, దాని ప్రభావం నుంచి ఇంకా కోలుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.**మిగతా 2లో...**

# ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ బెయిల్

### త్రిషపై వివాదాస్పద వ్యాఖ్యల దుమారం..



ఉదయనిధి స్టాలిన్‌పై ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు

ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టుకు వెళ్లిన డీఎంకే నేత

విచారణకు వచ్చే లోపే అరెస్ట్ చేసిన పోలీసులు

ఉదయనిధి వ్యాఖ్యలపై టీవీకే, బీజేపీ తీవ్ర విమర్శలు.

త్రిషకు క్షమాపణ చెప్పాలని డిమాండ్

వివాదం రాజకీయ ప్రేరేపితమని డీఎంకే వాదన

**చెన్నై ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**
తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని సృష్టిస్తున్నాయి. ఈ విషయంలో పోలీసులు ఇప్పటికే ఆయన్ను అరెస్ట్ చేశారు. చెన్నైలో ఆయన నివాసానికి పెద్ద ఎత్తున చేరుకున్న డీఎంకే కార్యకర్తలు పోలీసు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆరు సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు సమాచారం. మరోవైపు అరెస్టు నుంచి రక్షణ కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఉదయనిధి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అది విచారణకు వచ్చేలోపే ఆయన్ను అరెస్ట్ చేయడం గమనార్హం.**మిగతా 2లో...**

## మెగా డీఎస్సీ-2025 పిటిషన్ పై విచారణ మూడు వారాలకు వాయిదా

మెగా డీఎస్సీ-2025పై సీబీఐ విచారణ కోరుతూ హైకోర్టులో పిల్

క్రీడా కోటా నిబంధనలు మార్చి కొందరికి లబ్ధి చేకూర్చారని ఆరోపణ

అనర్హమైన స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో నియామకాలు జరిగాయన్న పిటిషనర్

**అమరావతి ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామకాల కోసం చేపట్టిన మెగా డీఎస్సీ-2025 ప్రక్రియలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు**మిగతా 2లో...**






## పోటెత్తుతున్న వరద..

వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద

నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులు

## గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

15 ఏళ్లలోపు పిల్లలకు ఎక్కువ ప్రమాదం

జ్వరం తర్వాత మెదడుపై దాడి చేసే అవకాశం

టీకా, ప్రత్యేక మందు ప్రస్తుతం లేవు

లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి

కీటకాల నుంచి రక్షణే ప్రధాన నివారణ




## పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం

13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు

కల్తీ మసాలాలలో క్యాన్సర్ వంటి ప్రమాదాలు

కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం

ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు

నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి




**హైదరాబాద్,ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**
ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్-ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.**మిగతా 2లో...**

## జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

### పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు

రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం

దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు

గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం



**ఢిల్లీ ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**
దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది.**మిగతా 2లో...**

## ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం

**హైదరాబాద్,ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు.**మిగతా 2లో...**



## అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు

కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్

సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు

**హైదరాబాద్,ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక**మిగతా 2లో...**



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888



# మెగా డీఎస్సీ-2025 పిటిషన్ పై విచారణ మూడు వారాలకు వాయిదా

**మొదటిపేజీ తరువాయి**

మంగళవారం విచారణ చేపట్టింది. ఈ నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలు కేవలం కొన్ని పొరపాట్లు కావని, ఇది వ్యవస్థీకృత వైఫల్యమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.
పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, రాష్ట్ర మాజీ అడ్వొకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందు ప్రభుత్వం క్రీడా కోటా విధానంలో కీలక మార్పులు చేసిందని శ్రీరామ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. క్రీడా కోటా రిజర్వేషన్లను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచారని, ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలన్న నిబంధనను కూడా తొలగించారని తెలిపారు. ఈ మార్పుల ద్వారా ముందుగా నిర్ణయించుకున్న కొందరు అభ్యర్థులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా పారదర్శకత లేకుండా వ్యవహరించారని ఆయన ఆరోపించారు.అర్హత లేని స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ఆధారంగా పలువురు అభ్యర్థులు నియామకాలు పొందారని, దీనికి సంబంధించిన కొన్ని నమూనా సర్టిఫికెట్లను ఆయన కోర్టు ముందు ఉంచారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు బదులుగా, కేవలం స్థానిక పోటీల్లో పాల్గొన్న సర్టిఫికెట్లను ఉపయోగించారని వాదించారు. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం క్రీడా కోటాకు సంబంధించిన జీవోలను వెనక్కి తీసుకుందని, ఈ చర్యే విధానపరమైన మార్పులపై తీవ్ర అనుమానాలకు తావిస్తోందని, కాబట్టి స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన పేర్కొన్నారు.సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా తాము చాలా సమాచారాన్ని సేకరించామని, ప్రభుత్వం పూర్తి మెరిట్ జాబితాను ప్రచురించనందున కొన్ని ఉదాహరణలను మాత్రమే కోర్టు ముందు ఉంచగలిగామని వివరించారు. ప్రభుత్వ చర్యలకు, బెదిరింపులకు భయపడి చాలా మంది బాధితులు కోర్టును ఆశ్రయించడం లేదని కూడా ఆయన తెలిపారు. ఈ అంశం వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించినది కాబట్టి, వ్యవస్థీకృత లోపాలను సరిదిద్దడానికి ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారానే దర్యాప్తు కోరుతున్నామని స్పష్టం చేశారు.వాదనలు విన్న హైకోర్టు, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు ప్రగతి నివేదిక..

**మొదటిపేజీ తరువాయి**

గత ప్రభుత్వ అణచివేత, వేధింపుల కారణంగానే ప్రజలు నిశ్శబ్ద విప్లవం ద్వారా తమకు చారిత్రాత్మక విజయాన్ని అందించారని చంద్రబాబు అన్నారు. "మా కూటమికి 57 శాతం ఓట్లు, 94 శాతం స్ట్రైక్ రేటుతో ప్రజలు బ్రహ్మాండమైన తీర్పు ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేశాక ఏడు కీలక శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేసి వాస్తవ పరిస్థితిని ప్రజల ముందు ఉంచాం. ఇప్పుడు రెండేళ్ల పాలన తర్వాత ఆర్థిక స్థితిగతులపై ఈ ప్రగతి నివేదిక ఇస్తున్నాం" అని ఆయన తెలిపారు. 2019–24 మధ్య కాలంలో రాష్ట్రంలో కేవలం విధ్వంసమే జరిగిందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. "అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. ప్రజలు, అధికారులు, చివరకు పోలీసులు కూడా భయంతో బతికే పరిస్థితిని కల్పించారు. ఏపీ బ్రాండ్‌ను దారుణంగా దెబ్బతీయడంతో ఇతర ప్రాంతాల్లో ఏపీ వాసులను చిన్నచూపు చూసే దుస్థితి ఏర్పడింది. పారిశ్రామికవేత్తలు తమ కంపెనీలను ఇక్కడ పెట్టబోమని చెప్పి పారిపోయిన పరిస్థితులను చూశాం" అని ఆయన ఆరోపించారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేకుండా, బస్సులో బస చేసి పాలన సాగించామని గుర్తుచేశారు. ఆ నష్టాల నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెడుతుంటే, గత ఐదేళ్లలో అంతకుమించిన నష్టం జరిగిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి నడిపిస్తున్నామని, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో ఇరిగేషన్, స్టీల్, ఏఐ, ఐటీ, ఫార్మా వంటి కీలక రంగాలపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు.

# పోటెత్తుతున్న వరద..

**ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి కృష్ణా నది వరద ప్రవాహం పోటెత్తుతోంది. ఐదు రోజుల క్రితం ప్రవాహం ప్రారంభమైన సమయంలో 820 అడుగులుగా ఉన్న నీటిమట్టం, నిన్న సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం డ్యామ్‌లో 92.048 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ సాయంత్రానికి ఈ నిల్వలు 100 టీఎంసీల మార్కును దాటుతాయని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు.శ్రీశైలం జలాశయం: జూరాల నుంచి సోమవారం 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రోజుకు లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చే ఈ వరద ఉద్ధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యామ్ సీఈ కబీర్ బాషా తెలిపారు.ఎగువ కర్ణాటక ప్రాజెక్టులు: ఆలమట్టి డ్యామ్‌లోకి 1,25,855 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 1,28,954 క్యూసెక్కులు వస్తుండగా, 1,40,880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.జూరాల ... తుంగభద్ర: నారాయణపూర్ నుంచి వస్తున్న నీటికి భీమా నది వరద జలాలు తోడవడంతో జూరాలకు ఏకంగా 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకొని జూరాల నుంచి 2,21,765 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 57,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 136 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో 28.91 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలోకి 6,958 క్యూసెక్కులు చేరుతుండగా, 6,499 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**మొదటిపేజీ తరువాయి**

పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.
తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

# జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

**మొదటిపేజీ తరువాయి**

లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు.తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు.బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**మొదటిపేజీ తరువాయి**

సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-÷బైర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

# ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ బెయిల్

**మొదటిపేజీ తరువాయి**

కావేరి జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉదయనిధి నిన్న ప్రసంగించారు. ఆ సమయంలో సభలో ఉన్న ఓ వ్యక్తి నటి త్రిష పేరు ప్రస్తావించగా, దానికి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు ద్వంద్వార్థంతో ఉన్నాయని విమర్శలు వచ్చాయి. మహిళలను అవమానించేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయని ప్రత్యర్థి పార్టీలు ఆరోపించాయి.అధికార టీవీకే పార్టీ నేత ఆధవ్ అర్జున్ ఉదయనిధిపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. రాజకీయాల స్థాయిని దిగజార్చేలా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. టీవీకే అధికార ప్రతినిధి ఫెలిక్స్ జెరాల్డ్ కూడా స్పందించారు. అదే వ్యాఖ్యలను తన కుటుంబ సభ్యుల ముందు చెబుతారా? అని ప్రశ్నించారు.బీజేపీ కూడా ఈ వ్యాఖ్యలను ఖండించింది. ఉదయనిధిని వెంటనే అరెస్టు చేయాలని తమిళనాడు బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి నారాయణన్ తిరుపతి డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై కూడా విమర్శలు గుప్పించారు. నటి త్రిషకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ డిమాండ్ చేశారు. అయితే ఈ వివాదాన్ని డీఎంకే కొట్టిపారేసింది. కావేరి జలాల సమస్య, డెల్టా రైతుల ఇబ్బందుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నారని మాజీ మంత్రి టీ. మనో తంగరాజ్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఉదయనిధి ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే ఈ ప్రచారం జరుగుతోందని అన్నారు.

## ఉదయనిధికి హైకోర్టులో ఊరట.. బెయిల్ మంజూరు

తమిళనాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఈరోజే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అలాగే విచారణకు పూర్తిగా సహకరించాలని ఉదయనిధికి సూచించింది.
ఈ నేపథ్యంలో బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు.ఉదయనిధిని రిమాండ్‌కు పంపే ఆలోచన తమకు లేదని తమిళనాడు పోలీసులు స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో మాత్రమే ఆయన్ను విచారిస్తున్నామని తెలిపారు. విచారణ పూర్తైన వెంటనే విడుదల చేస్తామని కూడా వెల్లడించారు.

# గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

**ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)**

గుజరాత్‌లో చండీపుర వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. సాధారణ జ్వరంలా మొదలయ్యే ఈ ఇన్‌ఫెక్షన్ కొన్ని గంటల్లోనే మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అసలు చండీపుర వైరస్ అంటే ఏంటి? ఇది ఎలా వ్యాపిస్తుంది? లక్షణాలు ఏంటి? చికిత్స ఉందా? తెలుసుకుందాం..



### ఏంటీ వైరస్?

రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినదే ఈ చండీపుర వైరస్ (సీహెచ్‌పీవీ). దీన్ని తొలిసారి 1965లో భారత్‌లో గుర్తించారు. వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే శాండ్‌ఫ్లై (ఇసుక ఈగ) వల్ల ఇది వ్యాపిస్తుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవు.

### ఎవరికి ఎక్కువ ప్రమాదం?

ఈ వైరస్ ఎక్కువగా 15 ఏళ్లలోపు చిన్నారులపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, శాండ్‌ఫ్లైలు ఎక్కువగా ఉండే చోట్ల ప్రమాదం అధికంగా ఉంటుంది. వర్షాకాలంలో ఈగల సంఖ్య పెరగడంతో వైరస్ వ్యాప్తి కూడా ఎక్కువగా కనిపిస్తుంది.

### మొదట కనిపించే లక్షణాలు ఏవి?

ప్రారంభంలో ఈ వైరస్‌ను గుర్తించడం కాస్త కష్టం. ఎందుకంటే మొదట సాధారణ వైరల్ జ్వరంలాగే కనిపిస్తుంది. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, ఫ్లూ లక్షణాలు ఉంటాయి. ఈ దశలో చాలామంది సాధారణ జ్వరంగా భావించే అవకాశం ఉంటుంది.

### ఎందుకు ప్రమాదకరం?

కొంతమంది చిన్నారుల్లో వైరస్ చాలా వేగంగా మెదడుపై దాడి చేస్తుంది. దీంతో మెదడు వాపు (ఎన్‌సెఫలైటిస్) వస్తుంది. ఆ తర్వాత పరిస్థితి గంటల వ్యవధిలోనే విషమించవచ్చు.

### తీవ్రమైన లక్షణాలు ఇవీ..

మూర్ఛ, స్పృహ కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని కేసుల్లో ఆసుపత్రిలో చేరిన 48 నుంచి 72 గంటల్లోనే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

### చికిత్స ఉందా?

ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేకంగా పనిచేసే మందు లేదు. టీకా కూడా అందుబాటులో లేదు. రోగికి కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందిస్తారు. శ్వాస, రక్తపోటు వంటి కీలక అవయవాల పనితీరును నిలకడగా ఉంచే ప్రయత్నం చేస్తారు. అందుకే లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం కీలకం.

### ఎలా జాగ్రత్త పడాలి?

చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేకపోవడంతో నివారణే ఉత్తమ మార్గం. శాండ్‌ఫ్లై కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు పూర్తి చేతులు కవర్ అయ్యేలా దుస్తులు వేయాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కీటకనాశక ద్రావణాలు, దోమతెరలు ఉపయోగించాలి. జ్వరం, వాంతులు, మూర్ఛలు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

### ఎందుకు అప్రమత్తంగా ఉండాలి?

చండీపుర వైరస్ చాలా అరుదుగా కనిపించినా, ఒకసారి సోకితే వేగంగా తీవ్ర స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. అందుకే పిల్లల్లో సాధారణ జ్వరంతో పాటు నాడీ సంబంధిత లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

**మొదటిపేజీ తరువాయి**

3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ ఆయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు
హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ -ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఊ-ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు
అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**మొదటిపేజీ తరువాయి**

గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ÷ఎఖ పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ÷ఎఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రో÷-లడెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# బస్సును ఢీకొన్న బైక్.. వ్యక్తి దుర్మరణం

**శ్రీ సత్యసాయి/ముదిగుబ్బ, ఆగస్టు 04,(రిపబ్లిక్ క్రైమ్):**


మండల కేంద్రం ముదిగుబ్బలో మంగళవారం ఉదయం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం స్థానికంగా విషాదాన్ని నింపింది. దొరిగల్లు రోడ్డులోని నర్సరీల సమీపంలో ద్విచక్రవాహనం ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ముదిగుబ్బకు చెందిన కమలాకర్ (55) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

**కమలాకర్ మృతితో కుటుంబంలో విషాదఛాయలు**

స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ముదిగుబ్బకు చెందిన కమలాకర్ ఉదయం తన వ్యవసాయ తోటకు వెళ్లి పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై గ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఉదయం సుమారు 7 గంటల సమయంలో దొరిగల్లు రోడ్డులోని నర్సరీల వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న పులివెందుల ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొట్టింది. అధిక వేగంతో ఢీకొనడంతో కమలాకర్ తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వివరాలు తెలుసుకొన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.మృతుడు ముదిగుబ్బకు చెందిన బండల శ్రీరాము పెద్ద అల్లుడని స్థానికులు తెలిపారు. కమలాకర్ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

## ఈడిగ సంఘం రాష్ట్ర నాయకుల డిమాండ్




**శ్రీ సత్యసాయి/చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 04,(రిపబ్లిక్ న్యూస్):**
సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి గ్రామంలోని కల్లు దుకాణాన్ని ఈడిగ సంఘం రాష్ట్ర నాయకులు మంగళవారం సందర్శించి గీత కార్మికుల జీవన పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తరతరాలుగా గీత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు నేటికీ కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గీత కార్మికుడు రామాంజనేయులు, ఆయన సతీమణి మాట్లాడుతూ తమ తాతలు, ముత్తాతల కాలం నుంచి ఇదే వృత్తిని కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామ శివారులో తాత్కాలిక పాకలో కల్లు దుకాణం నిర్వహిస్తున్నామని, వర్షాలు, ఎండలు, ఇతర ఇబ్బందుల మధ్య జీవనం సాగించాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వం తమ వృత్తిని గుర్తించి ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద కల్లు దుకాణం నిర్వహించేందుకు శాశ్వత గదిని కేటాయించాలని కోరారు.అలాగే తాటి చెట్ల నుంచి కల్లు సేకరించడానికి ప్రతిరోజూ దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి గీత కార్మికుడికి ఉచితంగా టూ వీలర్ అందించాలని, ప్రభుత్వ భూమిని కేటాయించి తాటి చెట్లను ఉచితంగా ఇచ్చి గీత వృత్తిని ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సంప్రదాయ వృత్తులు కొనసాగించే కుటుంబాలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు.

ఈడిగ సంఘం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ గీత కార్మికులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన ప్రోత్సాహం అందడం లేదన్నారు. ప్రభుత్వం గీత కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి గృహ వసతి, రవాణా సౌకర్యం, తాటి చెట్ల కేటాయింపు, వృత్తి అభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయం వంటి అంశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి గీత కార్మికుల జీవనోపాధికి భరోసా కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈడిగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల వేణుగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొడతల సూరిబాబు, రాష్ట్ర ట్రెజరర్ తుమ్మల నారాయణస్వామి, బొగ్గు శ్రీనివాసులు, యువ నాయకులు సాయి స్వాగత్‌తో పాటు సంఘ సభ్యులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

# తల్లిపాలే .. శిశువుకు శ్రీరామరక్ష

## డబ్బా పాలకు దూరంగా ఉండాలి- ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 04,(రిపబ్లిక్ న్యూస్):**


తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష అని సూపర్‌వైజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అనంతపురం నగరంలోని రాణినగర్ పరిధిలో ఉన్న ఆశ స్కూల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సూపర్‌వైజర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాధాన్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. తల్లిపాలు ప్రతి శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని, పుట్టిన వెంటనే శిశువుకు అందించే తొలి ఆహారం మాత్రమే కాకుండా శిశువుకు శ్రీరామరక్ష అని ఆమె పేర్కొన్నారు.

**ఎదుగుదలకు అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటాయి:**ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, ఇవి రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని వివరించారు. డబ్బా పాల కంటే తల్లిపాలే శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు.నేటి జీవనశైలిలో కొంతమంది తల్లులు అపోహలు, అవగాహన లోపం కారణంగా డబ్బా పాలపై ఆధారపడుతున్నారని, ఇది శిశువుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.

**తల్లిబిడ్డల మధ్య బంధం మరింత బలపడుతుంది** :తల్లిపాలు తాగే పిల్లల్లో పోషకాహార లోపం, ఇన్‌ఫెక్షన్లు, అలర్జీలు, జీర్ణ సంబంధ సమస్యలు తక్కువగా ఉంటాయని చెప్పారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లుల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని, ప్రసవానంతర ఆరోగ్య సమస్యలు తగ్గడంతో పాటు తల్లిబిడ్డల మధ్య భావోద్వేగ బంధం మరింత బలపడుతుందని వివరించారు.అవగాహన కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, సరైన పాలిచ్చే విధానం, శిశు పోషణ, తల్లి ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై సిబ్బంది వివరణాత్మకంగా తెలియజేశారు. గర్భిణులు, బాలింతల సందేహాలకు సమాధానాలు ఇచ్చి తల్లిపాలపై ఉన్న అపోహలను నివృత్తి చేశారు. అనంతరం తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆశ స్కూల్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు, ఆశా కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

# భూ..కబ్జా ..కలకలం

**వివాదంపై .. గళమెత్తిన బీసీ సంఘం**

**హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న భూమి**

**సీఐ, సర్వే సిబ్బందిపై**

**చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్**

**అనంతపురం టవర్ క్లాక్, ఆగస్టు 04,(రిపబ్లిక్ క్రైమ్):**
హైకోర్టులో కేసు పెండింగ్ లో ఉన్న భూమిని కొందరు అక్రమార్కులు దౌర్జన్యంగా కబ్జా చేశారు. అధికార బలం, రాజకీయ నాయకుల ప్రోత్బల్యంతో అగ్రకులాల వర్గాల వ్యక్తులు కలిసి బీసీ నాయకుల భూములను లాక్కున్నారు. దీనికి తోడు ఓ సిఐ దురుసు ప్రవర్తన బాధిత కుటుంబ వ్యక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి. ఆ సీఐ బెదిరిస్తూ.. భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బిసి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వీరితోపాటు రిసర్వే సిబ్బంది కూడా తమకు ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. 63 సర్వే నెంబర్లు 40 సెంట్లు ఎలాగైనా కాజేయాలని దురుద్దేశంతో విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అగ్రవర్ణాలకు అండగా ఓ సిఐ ఉండగా గుంతకల్లులో అధికార పార్టీ నాయకుల అక్రమ ఆగడాలు ఆగడం లేదు. దీంతో గుంతకల్లు నియోజకవర్గం లో బాధితులు కోకొల్లలే చెప్పవచ్చు. బాధితులకు న్యాయం చేసిన తహసిల్దార్ కార్యాలయం అగ్రవర్ణాలకు అండగా నిలిచి ఒకరు భూములనూ మరొకరకు కట్టబెట్టేస్తున్నారు. దీంతో రెవిన్యూ లో అధికారులకు అక్రమార్జన బ్రహ్మాస్త్రంగా మారింది. అధికార పార్టీ నాయకుల ఆక్రమణలకు బీసీ నాయకులు బలవుతున్నారు. హైకోర్టులో కేసు పెండింగ్లో ఉన్న భూమి కబ్జాకు పాల్పడ్డారని బీసీ సంఘాల నాయకులు గలమెత్తారు.




**సీఐ ప్రవీణ్ కుమార్, సర్వే విభాగ సిబ్బంది ఏకపక్షం**

గుంతకల్లు మండలం తిమ్మాపురం గ్రామంలోని సర్వే నంబర్63లో ఉన్న 7.51 ఎకరాల భూమి వివాదం నెలకొంది. ఈ భూమిపై కొందరు అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు అక్రమంగా కంచె వేసి చెట్లు నాటి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు, బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంలో గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, సర్వే విభాగ సిబ్బంది ఏకపక్షంగా వ్యవహరించి భూకబ్జాకు సహకరించారని వారు తీవ్రంగా మండిపడ్డారు. అనంతపురం నగరం ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

**సర్వే సిబ్బంది భూమిని కొలిచి తప్పుడు నివేదిక**

ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు అశ్వత్థ యాదవ్, జైపాల్ యాదవ్ మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామానికి చెందిన మాధవరావు భూమిని వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భూమి వివాదం హైకోర్టులో డబ్ల్యు పి నంబర్ . 29166/2023గా పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా సర్వే నిర్వహించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. గతంలో ఇదే అంశంపై బీసీ సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు ధర్నాలు నిర్వహించి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. కసాపురం సర్వే సిబ్బంది భూమిని కొలిచి తప్పుడు నివేదిక సమర్పించారని, హద్దులు మార్చి మ్యాప్‌లు తయారు చేసి అందజేశారని ఆరోపించారు. అనంతరం భూమికి ఫెన్సింగ్ వేయడానికి సహకరించారని విమర్శించారు.సర్వే నంబర్63లోని భూమి గతంలో సంధి పోతులరాజు యాదవ్‌కు చెందినదిగా సర్వేలో నిర్ధారణ జరిగిందని, ప్రస్తుతం దాదాపు 40 సెంట్ల భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బాధితులు తెలిపారు. సర్వే విభాగ సిబ్బంది వీరాంజనేయులు, లోకేష్‌పై కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

**విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

సీఐ ఏకపక్షంగా వ్యవహరిస్తూ బాధితులను బెదిరిస్తున్నారని, ప్రైవేట్ సర్వేయర్‌ను పిలిపించి సర్వే నిర్వహించడం, అనంతరం చెట్లు నాటడం వెనుక ఉద్దేశం ఏమిటో అధికారులు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారి భూములను అగ్రవర్ణాల వ్యక్తులు ఆక్రమించే పరిస్థితులు ఏర్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు.
సర్వే నంబర్68లో ఉన్న భూమికి సంబంధించి చట్టబద్ధంగా పట్టాదారు పాసుబుక్కులు ఉన్న వారికి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి కార్యాలయం ప్రజా ఫిర్యాదుల విభాగం (పీజీఆర్ఎస్)కు ఏటీపీ 20241212749 నంబర్‌తో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే బహుజన, బీసీ సంఘాలతో కలిసి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# పెండింగ్ వేతనాలు... వెంటనే విడుదల చేయాలి

**సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్**

**అనంతపురం ఆగస్టు 04,(రిపబ్లిక్ న్యూస్):**
ఉమ్మడి అనంతపురం జిల్లాలో సమగ్ర శిక్ష (ఎస్ ఎస్ ఏ) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ఎస్ ఎస్ , కేజీబీవీ ఫోరం జేఏసీ డిమాండ్ చేసింది. జిల్లాలో సుమారు 2,600 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, వీరి వేతనాల చెల్లింపునకు ప్రతి నెల రూ.6 కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని, ప్రస్తుతం రెండు నెలల వేతనాలు బకాయి ఉండటంతో రూ.12 కోట్ల నిధులను అత్యవసరంగా విడుదల చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

**ఉద్యోగులు గత 15 ఏళ్లుగా కీలక సేవలు**

కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది, సీఆర్‌పీలు, ఐఆర్‌టీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల అకౌంటెంట్లు, మెసెంజర్లు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఫిజియోథెరపిస్టులు, భవిత కేంద్రాల సిబ్బంది, సైట్ ఇంజినీర్లు, జిల్లా ప్రాజెక్టు కార్యాలయ ఉద్యోగులు తదితరులు గత 15 ఏళ్లుగా విద్యాశాఖలో కీలక సేవలు అందిస్తున్నారని తెలిపింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతంలో వీరి పాత్ర ఎంతో కీలకమని పేర్కొంది.

**అద్దెలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉద్యోగులు**

పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో పిల్లల ఫీజులు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు, బ్యాంకు రుణాల వాయిదాలు చెల్లించలేక ఉద్యోగులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించింది.

**టైమ్ స్కేల్ జీవోలను కూడా అమలు చేయడం లేదు**

ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్,



డా. కె.విజయ్‌ఉమ్మడి జిల్లా చైర్మన్
సమగ్ర శిక్ష , కేజీబీవీ ఉద్యోగుల ఫోరం జె ఏ సి

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని, మినిమమ్ టైమ్ స్కేల్ (ఎం టి ఎస్) జీవోలను కూడా అమలు చేయడం లేదని జేఏసీ పేర్కొంది. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమయానికి వేతనాలు చెల్లించే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.

**ప్రభుత్వం స్పందించాలి : డా. కె. విజయ్**

ఏపీ ఎస్ ఎస్ ఏ, కేజీబీవీ ఫోరం జేఏసీ ఉమ్మడి అనంతపురం జిల్లా చైర్మన్ డా. కె. విజయ్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 15 ఏళ్లుగా విద్యాశాఖకు వెన్నెముకలా పనిచేస్తున్నప్పటికీ కనీసం తమ కష్టార్జిత వేతనాల కోసం కూడా ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం వెంటనే రెండు నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, ఎం టి ఎస్ జీవోలను అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు రెగ్యులరైజేషన్‌పై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులను ఐక్యం చేసి ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

## -యాదవ టీడీపీ నేతల భరోసా




**ఆలూరు, ఆగస్టు, 4, (రిపబ్లిక్ న్యూస్)**
చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో టీడీపీ కార్యకర్త గొల్ల శేఖర్‌పై జరిగిన దాడిని టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాల పేరుతో భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం బళ్లారి పట్టణంలోని టీబీ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న గొల్ల శేఖర్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలపై దాడులను సహించేది లేదన్నారు. సంగాల ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను తెలుసుకుని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పార్టీ తరపున కృషి చేస్తామని తెలిపారు. కార్యకర్తలకు అండగా టీడీపీ నాయకత్వం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు.

టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమేనని, అయితే ప్రత్యర్థులపై దాడులకు పాల్పడటం సరికాదన్నారు. కార్యకర్తలపై దాడులు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు.

టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, యాదవ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ బీసీ వర్గాలకు చెందిన టీడీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. రాజకీయ కక్షలకు తావులేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాలు సాగించాలని సూచించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు.

కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ సంగాల ఘటనపై పార్టీ అధిష్టానానికి పూర్తి వివరాలు అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మాజీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ రాజకీయ విభేదాలు ఉండవచ్చని, కానీ భౌతిక దాడులు, బెదిరింపులు, అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. బీసీ, ఎస్సీ వర్గాలపై దాడులు జరుగుతున్నాయంటూ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఈ ఆదరణను చూసి వైసీపీ నాయకులు రాజకీయ కక్షతో టీడీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నాగేశ్వర్ యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలపై దాడులు చేయడం ద్వారా టీడీపీ శ్రేణులను భయపెట్టలేరన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ నాయకత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, వైకుంఠం శివప్రసాద్, మండల కన్వీనర్ పురుషోత్తం, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప, సీనియర్ నాయకుడు రామదుర్గం తిమ్మయ్య, మాజీ మండల కన్వీనర్ నేమకల్ లాయర్ వలి, టిడిపి సీనియర్ నాయకుడు సన్నప్ప, సంఘాల చంద్ర, భాస్కర్, బెల్దోన కోనంకి శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి వెంకటేశ్వర్లు, రామదుర్గం సోము నాయుడు, రామచంద్ర, దేగుల హాల్ మాజీ సర్పంచ్ నీలకంఠ, చిప్పగిరి బోగేశ్ స్వామి, నంచర్ల తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

# స్టాకింగ్ ప్రేమ కాదు ... శిక్షార్హమైన నేరం

**మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ**



**అనంతపురం ఎస్కేయూ, ఆగస్టు 04,(రిపబ్లిక్ న్యూస్):** సినిమాల్లో స్టాకింగ్‌ను ప్రేమగా, రొమాన్స్‌గా చూపించినప్పటికీ వాస్తవ జీవితంలో అది శిక్షార్హమైన నేరమని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్ సి డబ్ల్యూ) సహకారంతో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన "స్టాకింగ్‌ను ఎలా నివారించాలి?" అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వేధించడం వంటి చర్యలన్నీ స్టాకింగ్ పరిధిలోకే వస్తాయి

చాలామంది యువతులు, మహిళలు స్టాకింగ్ అంటే ఏమిటో, అది ఎలాంటి రూపాల్లో జరుగుతుందో తెలియక వేధింపులను భరిస్తున్నారని ఆమె తెలిపారు. ఒక వ్యక్తిని పదేపదే వెంబడించడం, వద్దని చెప్పినా ఆగకుండా ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, గిఫ్ట్‌లు, లేఖలు పంపడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బంది పెట్టడం, ఫోన్ లేదా సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేయడం, నకిలీ అకౌంట్లు సృష్టించి వేధించడం వంటి చర్యలన్నీ స్టాకింగ్ పరిధిలోకే వస్తాయని వివరించారు. గతంలో ప్రధానంగా ఫిజికల్ స్టాకింగ్ ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం సైబర్ స్టాకింగ్ ఘటనలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని చెప్పారు. స్టాకింగ్‌కు గురైన వారు మొదట దానిని గుర్తించి, ఆధారాలను భద్రపరచి, వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐపీఎస్ అధికారి సుప్రజ వివిధ కేస్ స్టడీలను వివరిస్తూ, యువతులు మాత్రమే కాకుండా వివాహిత మహిళలు కూడా స్టాకింగ్‌కు గురవుతున్నారని తెలిపారు. కొన్నిసార్లు ఈ వేధింపుల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవడం, తీవ్ర మానసిక ఒత్తిడి, ఆత్మహత్యల వరకు దారితీసిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు.

**ప్రారంభ దశలోనే గుర్తించి చట్టపరమైన చర్యలు**

న్యాయ నిపుణులు స్టాకింగ్‌కు సంబంధించిన చట్టాలు, ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించగా, సైకియాట్రిస్ట్‌లు బాధితుల్లో కలిగే మానసిక ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఒక విద్యార్థిని తన అనుభవాన్ని పంచుకుంటూ "నేను ట్రామటైజ్ అయ్యాను" అని చెప్పడం అందరినీ ఆలోచింపజేసిందని శైలజ తెలిపారు. స్టాకింగ్‌ను చిన్న విషయంగా తీసుకోకుండా ప్రారంభ దశలోనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, డిప్రెషన్, ఆందోళన, భయం వంటి మానసిక సమస్యలకు దారి తీసే ఈ నేరాన్ని అవగాహన ద్వారానే సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, న్యాయ నిపుణులు, సైకాలజిస్టులు స్టాకింగ్‌కు సంబంధించిన చట్టాలు, ఫిర్యాదు విధానం, మానసిక ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, విద్యార్థులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా యుద్ధనౌక గద్దర్ 3వ వర్ధంతి

**రాష్ట్రస్థాయి స్మారక సభకు సర్వం సిద్ధం -గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ**

**హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 04,రిపబ్లిక్ స్పెషల్ డిస్క్**

ప్రజా ఉద్యమాల చరిత్రలో తనదైన ముద్ర వేసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ మూడో వర్ధంతి సందర్భంగా గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా రాష్ట్రస్థాయి స్మారక సభ నిర్వహించనున్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ గద్దర్ జీవిత తత్వం, ఉద్యమ స్ఫూర్తి, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సాంస్కృతిక ఉద్యమాల పాత్ర వంటి అంశాలపై చర్చించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ వెల్లడించింది. ఈ రాష్ట్రస్థాయి స్మారక సభ గురువారం, ఆగస్టు 6, సాయంత్రం 4.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించబడనుందని ఫౌండేషన్ పేర్కొంది.

**ప్రజా సంస్కృతికి చేసిన సేవలను స్మరించుకుందాం**

గురువారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగే ఈ సభలో దేశవ్యాప్తంగా పేరుపొందిన రాజ్యాంగ నిపుణులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, కళాకారులు, ప్రజా గాయకులు, సామాజిక ఉద్యమకారులు పాల్గొని గద్దర్ వ్యక్తిత్వం, ఆయన ఆలోచనలు, సమాజంపై చూపిన ప్రభావం, ప్రజా సంస్కృతికి చేసిన సేవలను స్మరించనున్నారు.

సభలో మాజీ ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ), రాజ్యాంగ నిపుణుడు మాడభూషి శ్రీధర్ కీలక ఉపన్యాసం చేయనున్నారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ, పౌర హక్కులు, సమకాలీన సామాజిక పరిస్థితులు, ప్రజా ఉద్యమాల అవసరం వంటి అంశాలను



గద్దర్ జీవన ప్రయాణంతో అనుసంధానిస్తూ ఆయన ప్రసంగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గద్దర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శాంతా సిన్హా స్వాగతోపన్యాసం చేయనున్నారు. గద్దర్ ఫౌండేషన్ ఏర్పాటుకు ఉన్న లక్ష్యాలు, గద్దర్ ఆశయాల పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు, యువతలో ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించే ప్రయత్నాలపై ఆమె వివరించనున్నారు.

**గద్దర్ పాటలు కొత్త తరాల కళాకారులకు మార్గదర్శకం**

స్మారక ఉపన్యాసాన్ని వంచిత్ బహుజన్ ఆఘాడి అధ్యక్షుడు ప్రకాశ్ యశ్వంత్ అంబేద్కర్ అందించనున్నారు. సామాజిక న్యాయం, బహుజన రాజకీయాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సమానత్వ సమాజ నిర్మాణంలో గద్దర్ వంటి ప్రజా కళాకారుల పాత్రపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు. గౌరవ అతిథులుగా తెలంగాణ శాసనమండలి సభ్యుడు, ప్రముఖ కవి, పాటల రచయిత, ప్రజా గాయకుడు గోరటి వెంకన్న హాజరై గద్దర్‌తో తన అనుబంధాన్ని, ప్రజా సాహిత్యంలో ఆయన స్థానం, ప్రజా గీతాల ప్రభావాన్ని వివరించనున్నారు. అలాగే ప్రజాదరణ పొందిన గాయని మధు ప్రియ పాల్గొని గద్దర్ పాటలు, ఆయన స్ఫూర్తి కొత్త తరాల కళాకారులకు ఎలా మార్గదర్శకంగా నిలిచిందో వివరించనున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజా సంఘాల ప్రతినిధులు, రచయితలు, కళాకారులు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, కార్మిక, రైతు సంఘాల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు, గద్దర్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ సభకు హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. గద్దర్ జీవిత విశేషాలను ప్రతిబింబించే చిత్రాలు, ఆయన రచనలు, ఉద్యమ ప్రస్థానానికి సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ఉద్యమ శైలి.. నేటి తరానికి కూడా స్ఫూర్తి**

గద్దర్ తన జీవితాంతం ప్రజల సమస్యలను పాటల ద్వారా ప్రపంచానికి వినిపించారని, అణగారిన వర్గాల హక్కుల కోసం కళను ఆయుధంగా మలిచారని నిర్వాహకులు గుర్తు చేశారు. ఆయన సాహిత్యం, గానం, ప్రజా చైతన్యం కలగలిపిన ఉద్యమ శైలి నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. "ప్రజలే గద్దరన్న వారసులు అందరూ ఆహ్వానితులే" అంటూ గద్దర్ ఫౌండేషన్ ప్రజలకు ఆహ్వానం పలికింది. గద్దర్ ఆశయాలను స్మరించుకోవడమే కాకుండా వాటిని ఆచరణలో నిలబెట్టే సంకల్పానికి ఈ సభ వేదిక కావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య, సామాజిక న్యాయ విలువలను విశ్వసించే ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఫౌండేషన్ విజ్ఞప్తి చేసింది.

# సోలార్ కంపెనీల నుంచి రైతుల భూములను కాపాడాలి

**గుత్తి, ఆగస్టు 4 :( రిపబ్లిక్ న్యూస్)**

సోలార్ కంపెనీల మోసపూరిత ఒప్పందాల నుంచి రైతుల భూములను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోలార్ బాధిత రైతుల సమస్యలపై ఈ నెల 14న గుత్తిలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. గుత్తి మండలం జెడ్.వీరారెడ్డి కాలనీలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఓ.నల్లప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14న ఉదయం 10 గంటలకు గుత్తిలోని పెద్ద షాదీఖానా ఫంక్షన్ హాల్‌లో సోలార్ బాధిత రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోలార్ కంపెనీల ఒప్పందాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించే నిబంధనలను తొలగించేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సోలార్ కంపెనీలతో భూ వివాదాలు ఏర్పడితే



రైతుల నివాస ప్రాంతాలకు సమీపంలోని సివిల్ కోర్టుల్లోనే పరిష్కరించుకునే అవకాశం కల్పించాలని కోరారు. రైతులు ఇచ్చిన భూములను ఇతర కంపెనీలకు విక్రయించేందుకు, బదలాయించేందుకు అవకాశం లేకుండా ఒప్పందాల్లో కఠిన నిబంధనలు విధించాలని సూచించారు. సోలార్ ప్రాజెక్టుల కారణంగా వ్యవసాయ పనులు కోల్పోయే కూలీలకు కంపెనీల ద్వారా పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

సోలార్ కంపెనీల ద్వారా వచ్చే లాభాల్లో భూములు ఇచ్చిన రైతులకు ఏటా 10 శాతం వాటా అందించాలని, మరో 10 శాతం నిధులను ఆయా గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేసేలా ప్రభుత్వం షరతులు విధించాలని నాయకులు కోరారు. సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసిన గ్రామాల్లో ప్రజలకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో కరువు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టులకు తగినన్ని నిధులు కేటాయించి పూర్తి చేయాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించే విధానాలను వ్యతిరేకిస్తూ సదస్సు ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుత్తి మండల కార్యదర్శి నిర్మల, రైతు సంఘం నాయకులు రామకృష్ణ, మద్దిలేటి, మహిళా సంఘం నాయకులు రేణుక, రేవతి, కేవీపీఎస్ నాయకులు మల్లికార్జున, సీఐటీయూ నాయకులు రమేష్, సహకార సంఘం నాయకులు మల్లేష్, మద్దిలేటి రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలి

**గుంతకల్ ఆగస్టు 4 : (రిపబ్లిక్ న్యూస్)**

మండలంలోని అన్ని గ్రామాల్లో దళితులకు ప్రత్యేక స్మశాన వాటికలు ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్న వాటికి మౌలిక వసతులు కల్పించాలని కేవీపీఎస్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమాదేవి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, చేతివృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ కులవివక్ష లేని సమాజం కోసం జూలై 16 నుంచి సెప్టెంబర్ 10 వరకు దళిత కాలనీల్లో అధ్యయన యాత్రలు, వినతిపత్రాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యయన యాత్రల్లో అనేక దళిత కాలనీల్లో ఇప్పటికీ మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. కసాపురంలో పాత స్మశాన వాటికను



కొనసాగించడంతోపాటు జనాభా పెరిగినందున కొత్తగా కేటాయించిన స్మశాన వాటికను కూడా కొనసాగించాలని కోరారు. జి.కొట్టాల గ్రామంలోని స్మశాన వాటికకు ప్రహరీ, మౌలిక వసతులు కల్పించాలని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. దోసలుడికి, మల్లెనిపల్లి గ్రామాల్లో స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని కోరారు.

తిమ్మాపురం దళిత కాలనీలోకి మురుగునీరు రాకుండా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, అన్ని దళిత కాలనీల్లో తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. మండలంలోని దళితుల స్మశాన స్థలాలపై సమగ్ర సర్వే నిర్వహించి సమస్యలను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని కోరారు. అర్హులైన దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. అధికారులు దళిత కాలనీల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించకపోతే కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇతర దళిత సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల నాయకులు మారుతి ప్రసాద్, కసాపురం రమేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్, మాల మహానాడు జిల్లా నాయకులు బాలాంజనేయులు, రైతు సంఘం నాయకులు జక్కన్న, మహిళా సంఘం నాయకులు జ్యోతి, సుగుణ, ప్రమీల, రాణి, ఆవాజ్ పట్టణ నాయకులు షాషా ఖాదర్, మస్తాన్, కేవీపీఎస్ నాయకులు ఉలిగప్ప, కిష్టప్ప, డ్యానియల్, నాగరాజునాయక్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# వైద్య విద్య ఉన్నత శిక్షణ పూర్తి

**పట్టాలు అందుకున్న అధ్యాపకులు**





**అనంతపురం వైద్యం, ఆగస్టు 04,(రిపబ్లిక్ న్యూస్):** వైద్య బోధనా విధానాల్లో నైపుణ్యాలను పెంపొందించే ప్రతిష్ఠాత్మక అడ్వాన్స్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఏసీఎంఈ)ను ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులు విజయవంతంగా పూర్తి చేశారు. ఫార్మకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మ శ్రావణి, అనాటమీ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ ఎస్. ఉమామహేశ్వరరావు బెంగళూరులోని సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజీలో నిర్వహించిన ఆరు నెలల శిక్షణను పూర్తిచేసి, జూలై 30న జరిగిన స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎం. విజయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా ఇద్దరు అధ్యాపకులను సత్కరించి అభినందించారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థుల మూల్యాంకన పద్ధతులు, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, వైద్య విద్యలో సాంకేతికత వినియోగం వంటి అంశాలను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో పంచుకొని వైద్య విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ప్రిన్సిపాల్ సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల నుంచి ఇప్పటివరకు ఏడుగురు అధ్యాపకులు ఏసీఎంఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. 2017లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, 2021లో డాక్టర్ పి. అరుణ, అనంతరం డాక్టర్ బి.ఆర్. శ్యాంప్రసాద్, డాక్టర్ భవాని, 2024లో ఆచార్య డాక్టర్ సుచిత్ర శౌరి ఈ కోర్సును పూర్తిచేయగా, ప్రస్తుతం డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ ఉమామహేశ్వరరావు ఆ జాబితాలో చేరినట్లు పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా మాట్లాడుతూ మరింత మంది అధ్యాపకులు ఈ ఉన్నత శిక్షణను పూర్తిచేసి ఆధునిక వైద్య బోధనా పద్ధతులను అలవర్చుకోవడం ద్వారా కళాశాలను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

# మొక్కలు పంపిణి చేసిన పోలీస్ అధికారులు.





**ఆళ్లగడ్డ ఆగస్టు 4రిపబ్లిక్ న్యూస్** ఆళ్లగడ్డ పట్టణ సమీపంలోని టిట్కో నివాస గృహాల వద్ద జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు సీఐ నాగరాజురావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొని పోలీసు సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్ ఎల్ ఏ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం పట్టణ సి ఐ. జి. నాగరాజారావు మాట్లాడుతూనంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరన్ అదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమం మొదలు పెట్టామని టిడ్కో గృహాలలో మొత్తం 13వందల గృహాలు ఉన్నాయని ప్రతి గృహానికి ఒక మొక్క ప్రకారం 13వందల మొక్కలు నాటాలని ద్యేంగా పెట్టుకున్నామని ఈ రోజు విద్యార్థుల ద్వారా 100మొక్కలు నాటామని ప్రతి ఒక్క కుటుంబం ఒక మొక్కను సంరక్షించాలని అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యం అవుతుందని సి ఐ జి. నాగరాజారావు కోరారు ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ కిషోర్, సిబ్బంది,అనంత డిగ్రీ కాలేజీ లెక్షరర్లు,విద్యార్థిని, విద్యార్థులు, టిడ్కో గృహాల ప్రజలు పాల్గొన్నారు.

# డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

**ఆళ్లగడ్డ ఆగస్టు 4 రిపబ్లిక్ న్యూస్**



ఆళ్లగడ్డ పట్టణం లోని ఎమ్ వి నగరంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ డోర్ టు డోర్ కార్యక్రమంలో ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి మరియు మన ఆళ్లగడ్డలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించడం జరిగింది ఎమ్ వి నగరం లోని గడప గడపకు తిరుగుతూ పెన్షన్ లు అందరికి సరిగా అందుతున్నాయా అని అడుగుతు ఎమ్ వి నగరం లోని సమస్య లను తెలుసుకుంటు వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశీ చారు ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ హుస్సేన్ బాషా, శేకర్ రెడ్డి, నాగంజి, రవి కుమార్ రెడ్డి, పెద్దన్న, బాలిరెడ్డి, ప్రసాద్, పెద్ద సంఖ్యలో టి డి పి కార్యకర్తలు, భూమా అభిమానులు పాల్గొన్నారు.

# పాణ్యంఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా

**మురళి రెడ్డి ఈ హరికృష్ణ గౌడ్ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగాస్వీట్లు పంపిణీ**





**ఓర్వకల్లు ప్రతినిధి**

**, ఆగస్టు 04(రిపబ్లిక్ న్యూస్)**



నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు మరియు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన శకునాలగ్రామానికి చెందిన మురళి రెడ్డి ఈ,హరికృష్ణ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా గౌరు అభిమానులకు టిడిపి నాయకులకు కార్యకర్తలకు, వచ్చిన ప్రతి ఒక్కరికి స్వీట్లు పంపిణీ చేశారు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూలదండలు బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం హాజరైన ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండలం శకునాల గ్రామానికి చెందిన మురళి రెడ్డి, ఈ హరికృష్ణ గౌడ్, బాల్ రెడ్డి ఈ మధు గౌడ్, గన్ రెడ్డి,సాకలి మద్దిలేటి, బోయ ట్రాక్టర్ పుల్లయ్య, మంగలి తిరుమలేష్, చాకలి చింతల్, మహిళలతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎండుతున్న పంటలపై మండలంలో శాస్త్రవేత్తల పర్యటన



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 04 రిపబ్లిక్ న్యూస్**
చౌడేపల్లి మండలంలోని కొండా మరి, వెంగళపల్లి, దిగువపల్లి గ్రామాలలో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన
కృషి విజ్ఞాన కేంద్రం ,కలికిరి సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ కే మంజుల ఆధ్వర్యంలో వ్యవసాయ పరిశోధన స్థానం పెరమాళ్ళపల్లి శాస్త్రవేత్తలు ,కే వి కె ,మరియు అగ్రి పాలిటెక్నిక్ కలికిరి శాస్త్రవేత్తలు చౌడేపల్లి మండలంలో వివిధ గ్రామ పంచాయతీల్లో ఎల్ ని నో ప్రభావం వల్ల దెబ్బతింటున్న వివిధ పంటలను పరిశీలించారు. వేరుశనగ పంట వర్షాలు లేనందువలన చాలా చోట్ల పెరుగుదల లేకపోవడంతో పాటు చెట్లు ఎండిపోవడం మొదలైనట్లు గుర్తించారు. అంతర వరుసలుగా వేసినటువంటి అలసంద, అనుమలు కూడా వాడిపోయినట్లు ఎక్కువగా బీడు భూములు కనిపిస్తున్నాయి. ఆవులకు పెంచుకునే సూపర్ నేపియర్, జొన్న లాంటి పశుగ్రాస పంటలు కూడా బోర్ల కింద నీరు తగ్గిపోవడంతో వాడి ఎండిపోతున్నాయి అని తెలిపారు. ఆగస్టు - సెప్టెంబర్ మాసాలలో వర్షం వచ్చినప్పుడు కంది, అలసంద, అనుమలు, ఉలవ, పెసర ,మినుము, కొర్ర, జొన్న ,సజ్జ ,ఆముదం మొదలగు పంటలను సాగు చేసుకోవచ్చని రైతులకు సూచించారు . పంట నుంచి వచ్చే వ్యర్థాలను, ఎండి రాలే ఆకులను, చిరుకొమ్మలను మొదలగు వాటిని కొద్దిపాటి విస్తీర్ణంలో పెంచుకుంటున్న కూరగాయలు, పండ్ల తోటలలో, మరియు పూల తోటలలో ఆచ్ఛాదనంగా (మల్చింగ్) వేసుకోవాలని ,తద్వారా నీటి తడను తగ్గించుకోవచ్చని ,ఈ పదార్థమే కుళ్ళి ఎరువుగా ఉపయోగపడుతుందని తెలిపారు. వీలైన వారు పొలాల దగ్గర వర్షపు నీరు నిలువ ఉండగల గుంతలను ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. రైతులు పంట భీమా తప్పనిసరిగా చేయించుకోవాలి అని పర్యటన బృందం తెలియచేసింది. ఈ పొలాల సందర్శనలో పెరుమాళ్ళపల్లి రీసెర్చ్ స్టేషన్ హెడ్ డాక్టర్.ఎమ్.రెడ్డి కుమార్ , సైంటిస్ట్ డాక్టర్ కె ఆర్ ఠాగోర్, మండల వ్యవసాయ అధికారి మోహన్ సబ్జెక్టు మాటర్ స్పెషలిస్ట్ ఎస్. సోమశేఖర బాబు మరియు అగ్రి ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ టీచర్ జ్యోత్స్న మరియు అగ్రి ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థినులు మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## భవిత బిల్డింగ్ ప్రారంభించిన ఎమ్ ఎల్ ఏ భూమా అఖిల ప్రియ.







**ఆళ్లగడ్డ ఆగస్టు 4రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ పట్టణం లోని ఎమ్ వి నగరం లో ప్రభుత్వ పాఠశాల వెనక ప్రభుత్వం30లక్షల రూపాయలతో నిర్మించిన భవిత కేంద్రం సహిత విద్య భవనాన్ని ఎమ్ ఎల్ ఏ భూమా అఖిల ప్రియ, ప్రారంభించారు.ఎమ్ ఎల్ ఏ వెంట నంద్యాల డి ఈ ఓ, ఎమ్ ఈ ఓ, ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.ఎమ్ ఎల్ ఏ పిల్లలకు చాకోలెట్స్ పంచి వారితో సరదాగా మాట్లాడుతూ వారి యోగ క్షేమాలు, అడుగుతా వారితో ఫొటోలు దిగి వారి తల్లి తండ్రులతో మాట్లాడి ఈ భవిత కేంద్రంలో సదుపాయాలు అన్ని ఉన్నాయ అంటూ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ఆరు మండలాలకు సంబంధించి భవిత బిల్డింగ్స్ 30 లక్షల రూపాయలతో సాంక్షన్ కావడం జరిగిందని, వీఎ నగరంలో ఈరోజు నూతన బిల్డింగ్ ప్రారంభించడం జరిగిందని, ఈ బిల్డింగ్ లో 22 మంది పిల్లలు, ఇద్దరు టీచర్స్ మరియు ఆయా ఉంటారు అని, ఈ పిల్లలందరికీ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని ఈ భవిత బిల్డింగ్ లో ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ పిల్లలకి గవర్నమెంట్ ద్వారా ఇద్దరు టీచర్స్ మరియు ఆయా, అన్ని సౌకర్యాలతో పిల్లలను చూసుకోవడం అనేది చాలా ఆనందంగా ఉందని గవర్నమెంట్ వారు ఇలాంటి మంచి ప్రోగ్రాం చేయడం వల్ల ఇలాంటి పిల్లలు చదువుల్లో ఇంకా ముందుకు వెళ్తారని. తల్లి తండ్రులు కూడా మీ ఇళ్లలో ఇలాంటి పిల్లలు వుంటే ఈ భవిత కేంద్రానికి తీసుకోని వచ్చి వారికీ అన్నిటిలో శిక్షణ ఇప్పించాలని అలా బైటికి తీసుకోని రాలేని పిల్లలు ఉంటే వారికీ వారానికి ఒకసారి ఈ భవిత కేంద్రం వారే. మీ ఇంటి వద్దకు వచ్చి శిక్షణ ఇస్తారని కావున ప్రభుత్వం అందిస్తున్న ఈ తొడ్పాటును ఉపయోగించుకోవాలని కోరారు.అలాగే కూటమి ప్రభుత్వం ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి 40 లక్షల రూపాయలతో RTG సెంటర్ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నంద్యాల డి ఈ ఓ, ఆళ్లగడ్డ ఎమ్ ఈ ఓ శోభ వివేకావతి, పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్ హుస్సేన్ బాషా, టి డి పి నాయకులు శేకర్ రెడ్డి, ఎమ్ వి నగర్ టి డి పి నాయకులు నాగంజి, బాలిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, పెద్దన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గోరుకల్లు, అవుకు రిజర్వాయర్లు పరిశీలించిన గంగుల బ్రీజేంద్రారెడ్డి.

**రాయలసీమ లిఫ్ట్‌తో కరువు జిల్లాలకు ప్రయోజనకరం. -రేవంత్‌రెడ్డితో రహస్య ఒప్పందం చేసుకున్న చంద్రబాబు.**





**ఆళ్లగడ్డ ఆగష్టు 4 రిపబ్లిక్ న్యూస్**
ఈ సందర్భంగా గంగుల బ్రిజేంద్రనాధరెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవాను 11 వేల క్యూసెక్కులకు పెంచాలి సీమకు ద్రోహం చేసి చరిత్రహీనులుగా మిగిలిపోవద్దు. రాయలసీమ అంటేనే కరువు ప్రాంతం. 1996లో చంద్రబాబు గాలేరునగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు శంకుస్థాపన మాత్రమే చేశారు. పనులను ముందుకు తీసుకెళ్లలేదు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో హంద్రీనీవా, గాలేరునగరి, వెలిగొండ పూర్తి చేసి ఉంటే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ మేరకు మనకు నికర జలాలు అందేవి. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాకే సాగునీటి ప్రాజెక్టులు పరుగుపెట్టాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 44 వేల క్యూసెక్కులకు పెంచిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డిది. వైఎస్ చలవతోనే హంద్రీనీవా పనులు శరవేగంగా సాగాయి. వైఎస్ఆర్ కృషితోనే 2012 నుంచి కృష్ణా జలాలు హంద్రీనీవా ద్వారా వస్తున్నాయి. హంద్రీనీవా తొలి దశ పనులతో పాటు రెండో దశలో 75 నుంచి 80 శాతం పనులు వైఎస్ హయాంలోనే పూర్తయ్యాయి.
2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ప్రాజెక్టులను పట్టించుకోలేదు. హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగు గంగ డిస్ట్రిబ్యూటరీలను పట్టించుకోలేదు. ఆయకట్టుకు నీరందించలేదు. ఈ రోజు హంద్రీనీవా కోసం వంద రోజుల్లో రూ.3800 కోట్లు ఖర్చు చేశామని చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారు. తొలి దశ పనులను 3850 క్యూసెక్కులకు పెంచామని చెబుతున్నా వాస్తవానికి 2700 క్యూసెక్కులు కూడా రాలేదు. రెండో దశలో లైనింగ్ పేరుతో దోపిడీ చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం వల్ల గ్రేటర్ రాయలసీమ జిల్లాలకు ప్రయోజనం చేకూరుతుంది. కానీ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చేసుకున్న రహస్య ఒప్పందం కారణంగా సీమ ప్రయోజనాలను చంద్రబాబు తాకట్టుపెట్టారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 780 అడుగల నుంచి తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులకు నీళ్లను మళ్లిస్తోంది. అయినా చంద్రబాబుకు పట్టడం లేదు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి అయితే మనం కూడా తక్కువ సమయంలో ఎక్కువ నీళ్లను తీసుకెళ్లవచ్చు.
రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఎన్జీటీ అనుమతి లేదని చంద్రబాబు సాకులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి ఆయనకు లేదు.
రాయలసీమలో పుట్టిన చంద్రబాబు రాజకీయంగా ఎంతో ఎదిగారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. కానీ ఆయన ఎప్పుడు సీఎంగా ఉన్నా సీమకు ద్రోహమే చేస్తున్నారు. తక్షణం రాయలసీమ లిఫ్ట్ పనులు పూర్తి చేయడంతో పాటు హంద్రీనీవాను 11 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలి. రాయలసీమలోని ప్రజాప్రతినిధులు కూడా తమ గళం విప్పి చంద్రబాబుపై ఒత్తిడి తీసుకురావాలి. లేనిపక్షంలో మీరంతా చరిత్రహీనులుగా నిలిచిపోతారు.అంటూ గంగుల బ్రిజేంద్రనాధరెడ్డి హెచ్చరించారు.

## మూడు చక్రాల మోటార్ సైకిల్ అందుకున్న దివ్యాంగ లబ్ధిదారుడు

**ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మాదిగ సంపత్**



**ఎమ్మిగనూరు, ఆగస్టు, 4,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు.ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు మాదిగ సంపత్‌కు మూడు చక్రాల మోటార్ సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వాహనం అందుకున్న సంపత్ ఆనందం వ్యక్తం చేస్తూ, తనకు ఎంతో ఉపయోగపడే ఈ సౌకర్యాన్ని కల్పించిన కూటమి ప్రభుత్వానికి, అలాగే ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డికి శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దివ్యాంగుల స్వావలంబన, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముని శేఖర్ రెడ్డి, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 4)**
కర్నూలు జిల్లా ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ) విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తనిఖీ చేసి, స్టేషన్‌లోని రికార్డులు, కేసుల పురోగతిని సమీక్షించారు.పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించిన పెండింగ్ దర్యాప్తులు, నిందితుల అరెస్టులు, కేసుల విచారణ పురోగతి తదితర అంశాలపై ఆయన క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై ఆరా తీసిన ఎస్పీ, ప్రమాదాల నియంత్రణ కోసం మరింత సమర్థవంతమైన చర్యలు అమలు చేయాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.ప్రాపర్టీ కేసులను త్వరగా ఛేదించి, చోరీ సొత్తు రికవరీపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని చెప్పారు.పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులకు సత్వర న్యాయం అందేలా స్పందించి, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ తనిఖీలో కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్సై నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు-విజయవాడ నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభం

**--జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి.. -స్వయంగా బస్సు నడిపిన ఎమ్మెల్యే**





**ఎమ్మిగనూరు, ఆగస్టు 4,( ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):**ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుండి విజయవాడకు నూతన బస్సు సర్వీసును మంగళవారం స్థానిక ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి, ఎమ్మిగనూరు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడుతో కలిసి ప్రత్యేక పూజల అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా బస్సును కొంతదూరం నడిపి సేవలను ప్రారంభించడం విశేషంగా నిలిచింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎమ్మిగనూరు పరిసర ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ఎమ్మిగనూరువిజయవాడ బస్సు సర్వీస్ ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సర్వీస్ ప్రారంభానికి సహకరించిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం నుంచి వయా ఎమ్మిగనూరు మీదుగా విజయవాడ వరకు ఈ బస్సు సర్వీస్ నడుస్తుందని తెలిపారు. అలాగే బనవాసి గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు బనవాసి గురుకుల పాఠశాల వరకు పల్లెవెలుగు బస్సు సర్వీసును ప్రారంభించినట్లు వెల్లడించారు. దీంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు చేరుకునేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బనవాసి గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఇంతకాలం పాఠశాలకు సమయానికి చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. ఇటీవల జరిగిన పేరెంట్స్ సమావేశంలో తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి బస్సు సర్వీస్ ఏర్పాటు చేయించడం పట్ల ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి, ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు మునిశేఖర్ రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కె. మల్లయ్య, ఆర్టీసీ సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## డిసిఈబి సెక్రటరీ నియామకం సీనియారిటీ ప్రాతిపదికన జరగాలి: ఫ్యాప్టో

**జిల్లా విద్యాధికారికి ఫ్యాప్టో ప్రతినిధ్యం -పారదర్శకంగా నియామకం చేపడతామని డీఈఓ హామీ**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 4)**కర్నూలు జిల్లాలో ఖాళీగా ఉన్న డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) సెక్రటరీ పోస్టును ప్రభుత్వ నియమావళి ప్రకారం సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలని కర్నూలు జిల్లా ఫ్యాప్టో డిమాండ్ చేసింది.ఈ మేరకు జిల్లా ఫ్యాప్టో కార్యదర్శి భాస్కర్ నాయకత్వంలో ప్రతినిధి బృందం జిల్లా విద్యాధికారి (డీఈఓ)ను కలిసి వినతిపత్రం సమర్పించింది. డీసీఈబీ సెక్రటరీ నియామక ప్రక్రియలో నియమ నిబంధనలు పాటిస్తూ అర్హత, సీనియారిటీకి ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు.ఈ సందర్భంగా స్పందించిన జిల్లా విద్యాధికారి, డీసీఈబీ సెక్రటరీ నియామకం ప్రభుత్వ నియమావళి మరియు సీనియారిటీ ప్రాతిపదికననే జరుగుతుందని తెలిపారు. నియామక ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావు లేకుండా పూర్తిస్థాయి పారదర్శకత పాటిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి భాస్కర్‌తో పాటు యూటీఎఫ్ నాయకులు రవికుమార్, ఏపీటీఎఫ్-1938 నాయకులు ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయ సంఘం నాయకులు హుస్సేన్, శ్రీనివాస్ యాదవ్, ఆప్టా నాయకులు సేవాలాల్ నాయక్, డీటీఎఫ్ నాయకులు భీమన్న, బీటీఏ నాయకులు వెంకటేష్, మండల విద్యాధికారుల సంఘం నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు శాస్త్రవేత్తల సూచనలు



**గుత్తి, ఆగస్టు 4: (రిపబ్లిక్ న్యూస్)**
ఎల్‌నినో ప్రభావంతో పత్తి పంటలో నెలకొన్న బెట్ట పరిస్థితులను అధిగమించేందుకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు బేతేపల్లి, బసినేపల్లి, రజాపురం, కొజ్జేపల్లి గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. పత్తిలో బెట్ట పరిస్థితులను అధిగమించేందుకు లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్, 3 గ్రాముల బోరాన్ కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఫ్లోనికమైడ్ (ఉలల) మందును ఎకరాకు 60 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతిని గమనించిన నేపథ్యంలో ఎకరాకు 10 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసి పురుగు ఉధృతిని తగ్గించుకోవాలని సూచించారు.

**పంటల సాంద్రత తగ్గించాలి**

కంది, ఆముదం పంటల్లో మొక్కల సాంద్రతను తగ్గించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు తెలిపారు. ఎక్కువ వత్తుగా ఉన్న మొక్కలను తొలగించి వరుసలో మొక్కకు మొక్కకు మధ్య 20 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూడాలన్నారు. విత్తిన 30, 60 రోజుల తర్వాత గుంటక లేదా గొర్రుతో అంతర కృషి చేయడం ద్వారా కలుపు నివారణతోపాటు నేలలో తేమను కాపాడుకోవచ్చని తెలిపారు.

**వర్షాల అనంతరం పంటల సాగు**

ఆగస్టులో వర్షాలు కురిసిన అనంతరం తేలికపాటి నేలల్లో జొన్న, కొర్ర, సజ్జ, పెసర, అలసంద, మేత జొన్న, ఉలవలు సాగుకు సిద్ధం కావాలని సూచించారు. బరువైన నేలల్లో ఆముదం, జొన్న, కొర్ర, సజ్జ, పెసర, అలసంద, కంది, ఉలవలు సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు బిసిస్ , పీఎంఫబయ్ పంటల బీమా పథకాల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. నీటి వినియోగంలో పొదుపు పాటిస్తూ భూమిలో తేమ ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహమద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కిషోర్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ చందన, కళాశాల సిబ్బంది డాక్టర్ కవిత, డాక్టర్ సుస్మిత, రైతు సేవా కేంద్రం సిబ్బంది హరిత, రామచంద్ర, నరేంద్ర, రవితేజ, ఇన్సూరెన్స్ మేనేజర్ సురేంద్ర పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

## -- ఎస్ఈ రామ్మోహన్ రెడ్డి



**ఎమ్మిగనూరు, ఆగస్టు 4 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** ఎల్‌నినో ప్రభావంతో ఎమ్మిగనూరు పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖ ఎస్ఈ రామ్మోహన్ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం గుడికల్ చెరువు, ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించి తాగునీటి నిర్వహణపై పలు సూచనలు చేశారు.అనంతరం బనవాసి ఫారం సమీపంలోని ఎన్టీఆర్ స్మార్ట్ సిటీ మౌలిక వసతుల అభివృద్ధి పనులను పరిశీలించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఈ సతీష్ కుమార్, ప్రజారోగ్య శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ రాజశేఖర్, మున్సిపల్ డీఈఈలు నీరజ, రాజు నాయక్, శరత్ చంద్ర, ఏఈలు ప్రతాప్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ బాధితులకు అండగా వైఎస్సార్సీపీ




**గుంతకల్, ఆగస్టు 4 :(రిపబ్లిక్ న్యూస్)**డీఎస్సీ2025లో చోటుచేసుకున్న లీకేజీ, అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, సూపర్ సిక్స్ హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల భృతి అందించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, గుంతకల్లు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి వై. వెంకటరామిరెడ్డి సూచనలతో శనివారం గుంతకల్లులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి టౌన్‌హాల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ2025 పేరుతో నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని కోరారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.డీఎస్సీ బాధితులు, నిరుద్యోగ యువత, విద్యార్థులకు అండగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని నైరుతిరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు నియోజకవర్గ కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆగస్టు 10న యువత, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు.సమావేశంలో పాల్గొన్న యువత, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు డీఎస్సీ2025 వ్యవహారంపై ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. డీఎస్సీ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేతన్న నేస్తం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

## : మాచాని సోమనాథ్



**ఎమ్మిగనూరు, ఆగస్టు 4 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** అర్హులైన ప్రతి చేనేత కార్మికుడు నేతన్న నేస్తం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మాచాని సోమనాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తూ చేనేత కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడి ఖాతాలో రూ.25 వేల ఆర్థిక సహాయం జమ చేయనున్నట్లు తెలిపారు.ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులు చేనేత మగ్గం కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో సంబంధిత గ్రామ లేదా వార్డు సచివాలయంలో సంబంధిత అధికారుల ద్వారా గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

## : అంగన్వాడీ సిబ్బంది



**ఎమ్మిగనూరు , ఆగస్టు 4,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** చిన్నారుల సమగ్ర వికాసానికి, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో ముఖ్యమని అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తెలిపారు. మంగళవారం కడివెల్ల గ్రామ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించి గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు.అంగన్వాడీ టీచర్ బంగారమ్మ, సూపర్వైజర్ సురేఖ మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే తొలి పాలు (జున్ను పాలు) శిశువుకు తొలి టీకా వంటివని, అవి రోగనిరోధక శక్తిని పెంచుతాయని తెలిపారు. పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీళ్లు కూడా అవసరం లేదని వివరించారు.ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించి ఆకుకూరలు, గుడ్లు, పప్పుధాన్యాలు, బలామృతం వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, మహిళా పోలీస్ వాణి, గ్రామ మహిళలతో కలిసి చైతన్య ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

# మహిళలు, బాలల సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం సహించం

**అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలి**
**జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

**వీధి బాలల గుర్తింపు, పునరావాసానికి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశం**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 4)**
మహిళలు, బాలల సంక్షేమానికి సంబంధించిన అన్ని పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశించారు. బాలల సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్య ధోరణి ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పథకాల అమలుపై జిల్లా బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ), మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ (ఎంవీసీడీ) మార్గదర్శకాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం స్వతంత్రంగా పనిచేయాల్సి ఉందని పేర్కొన్నారు. వెంటనే ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసుకుని చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో సమన్వయం చేసుకుంటూ సేవలు అందించాలని డీసీపీయూ అధికారులను ఆదేశించారు.పీఎం కేర్స్ పథకం కింద జిల్లాలో కేవలం 16 మంది మాత్రమే లబ్ధిదారులుగా గుర్తించబడటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్న కలెక్టర్, అర్హులను గుర్తించడంలో అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. జిల్లాలో బాలల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు మరింత ఫలితాల ఆధారంగా అమలయ్యేలా అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు.జిల్లా ప్రధాన కేంద్రంతో పాటు అన్ని డివిజన్లలో ప్రతి నెలా వీధి బాలలను గుర్తించి రక్షించే ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. గుర్తించిన బాలలకు అవసరమైన సంరక్షణ, విద్య, పునరావాసం కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో ఐసీడీఎస్ పీడీ విజయ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జుబేదా బేగం, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, వెంకట రమణయ్య, మధుసూదాకర్, జిల్లా ప్రొబేషన్ అధికారి దివాకర్, అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ చివరినాటికి అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలి : కలెక్టర్ డా. ఏ. సిరి

**15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల సద్వినియోగంతో కర్నూలును హరిత, సుందర నగరంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశం**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 4)**
కర్నూలు నగరాన్ని పచ్చదనంతో నిండిన సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ నగర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
కలెక్టర్ కార్యాలయంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్, నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్, జనరల్ ఫండ్స్ ద్వారా చేపడుతున్న పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న టెండర్లను త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, వివిధ కారణాలతో నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.నగరంలోని తొమ్మిది ప్రధాన కూడళ్లను ఫౌంటెన్లు, హైమాస్ట్ లైట్లు, పెయింటింగ్‌లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. వాహనాల ద్వారా వ్యాపించే దుమ్ము, ధూళి, కాలుష్య నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు ప్రహరీలు లేని పార్కులకు వెదురు కంచెలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నగరంలోని రహదారులను గుంతల రహితంగా మార్చి, ఒకే సమయానికి తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సుద్దవాగు, ఒక్కెరవాగు, హంద్రీ, కేసీ కెనాల్‌ల పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని సూచించిన కలెక్టర్, నగరంలో లక్ష్యంగా పెట్టుకున్న 22 వేల మొక్కల నాటకం పూర్తి చేయాలని చెప్పారు. బ్రిడ్జిలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వ్రేలాడే మొక్కలను పెంచాలని, ఉల్చాల కూడలి పనులను త్వరగా పూర్తి చేయాలని, బుధవారపేట మరియు రైల్వే స్టేషన్ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ కూడలి వరకు రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలిగేలా చూడాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నగరంలోని ఉద్యానవనాలను ప్రజలకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని అందించేలా అభివృద్ధి చేసి కర్నూలును హరిత సుందర నగరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.
ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి కర్నూలు నగరానికి తాగునీటి సరఫరా కోసం సుమారు రూ.500 కోట్ల వ్యయంతో ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. నగరంలో 200 మంది కార్మికులతో మురికికాలువల్లో ఇసుక మేటల తొలగింపు పనులు చేపడుతున్నామని, సుద్దవాగుకు రక్షణ గోడ నిర్మాణ చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మనోహర్ రెడ్డి, గిరిరాజు, డిప్యూటీ ఇంజనీర్లు శ్రీనివాసులు, పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, నరేష్, హేమలత, అసిస్టెంట్ ఇంజనీర్లు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్ధన్, వైష్ణవి, విజయరాజు, హార్టికల్చర్ అధికారి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు గ్రూప్‌కు తల్ సైనిక్ టైటిల్

**ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ -సర్వీస్ రైటింగ్ విభాగాల్లో సైనిక నైపుణ్యాల ప్రదర్శన**



**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 04, (రిపబ్లిక్ న్యూస్):**
తల్ సైనిక్ క్యాంప్ (టి ఎస్ ఈ) ఇంటర్ గ్రూప్ పోటీల్లో కర్నూలు గ్రూప్‌కు తల్ సైనిక్ టైటిల్ వరించిందని ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్ సైనిక్ క్యాంప్ (టి ఎస్ ఈ) ఇంటర్ గ్రూప్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. పది రోజులపాటు జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కర్నూలు గ్రూప్ ఛాంపియన్ గ్రూప్ ట్రోఫీని కైవసం చేసుకుంది.
అనంతపురంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ, వి ఎస్ ఎం ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.డైరెక్టరేట్‌కు చెందిన తొమ్మిది ఎన్‌సీసీ గ్రూపుల నుంచి సీనియర్ డివిజన్, సీనియర్ వింగ్ క్యాడెట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అడ్డంకుల శిక్షణ, మ్యాప్ రీడింగ్, ఆరోగ్యం,పరిశుభ్రత, దూర నిర్ధారణ, ఫీల్డ్ సిగ్నల్స్, సర్వీస్ రైటింగ్ తదితర విభాగాల్లో తమ సైనిక నైపుణ్యాలను ప్రదర్శించారు. క్యాడెట్ల శారీరక సామర్థ్యం, క్రమశిక్షణ, వ్యూహాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలను పరీక్షించేలా పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ మాట్లాడుతూ క్యాడెట్లు పోటీల్లో ప్రదర్శించిన అంకితభావం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి ప్రశంసనీయమన్నారు. ఇటువంటి శిక్షణలు యువతలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, దేశసేవా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.పోటీల్లో ఎంపికైన క్యాడెట్లు సెప్టెంబర్ తొలి వారంలో న్యూఢిల్లీలో జరగనున్న అఖిల భారత తల్ సైనిక్ క్యాంప్2026లో ఆంధ్రప్రదేశ్‌తెలంగాణ డైరెక్టరేట్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తారనే ఆశాభావాన్ని డైరెక్టరేట్ అధికారులు వ్యక్తం చేశారు.



# సీడీపీఓ మద్దెమ్మపై ఆరోపణలు పూర్తిగా నిరాధారం

## : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

**వేధింపులు, అవినీతి ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం**
**-కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 4)**
కర్నూలు జిల్లా అస్పరి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ మద్దెమ్మపై కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అవాస్తవమైనవని దేవనకొండ, తెర్నేకల్, అస్పరి, బిల్లేకల్ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు స్పష్టం చేశారు.అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సుజాత, నాగమణి, ప్రమీల, చిట్టెమ్మ, మెహరీన్ బీ ఆధ్వర్యంలో మీడియాతో మాట్లాడారు. గత నెల 21వ తేదీన జరిగిన ప్రాజెక్టు సమావేశంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ విజయ సమక్షంలో కోటకొండ సెక్టార్‌కు చెందిన కొందరు వ్యక్తులు సీడీపీఓ మద్దెమ్మపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని తెలిపారు.ప్రాజెక్టు పరిధిలోని 131 అంగన్‌వాడీ కేంద్రాల్లో 110 కేంద్రాల టీచర్లు, ఆయాలకు సీడీపీఓ వల్ల ఎలాంటి సమస్యలు లేవని పేర్కొన్నారు. సీడీపీఓ తమను మానసికంగా వేధిస్తున్నారంటూ చేసిన ఫిర్యాదులు నిజం కాదన్నారు. అధికార దుర్వినియోగం, దుర్భాషలాడడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం వంటి ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు.సీడీపీఓ మద్దెమ్మ ఎలాంటి వేధింపులకు పాల్పడలేదని, ఆమెపై తప్పుడు ప్రచారం జరుగుతోందని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ తమను కొందరు వ్యక్తులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోటకొండ సెక్టార్‌కు చెందిన కొందరు టీచర్లు, బీజేపీకి చెందిన కొందరు నాయకులు తమపై ఒత్తిడి తీసుకొస్తూ, గొడవలు జరుగుతాయని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ వి.జి. భవాని మాట్లాడుతూ, తాను కప్పట్రాళ అంగన్‌వాడీ సెంటర్-2లో విధులు నిర్వహిస్తున్నానని, సీడీపీఓ మద్దెమ్మకు రూ.3 లక్షలు ఇచ్చానంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం తగదని ఆమె అన్నారు. సీడీపీఓపై తప్పుడు ఆరోపణలు చేసి ఆమె ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని అంగన్‌వాడీ సిబ్బంది ఆరోపించారు.

## పటాన్ చెరువు ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం..

**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 4( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

తెలంగాణ కెరటం పత్రిక ఎం.డి,ఎడిటర్ కుక్కల రాజు ముదిరాజ్ పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ కెరటం స్టేట్ ఇంచార్జ్ షేక్ మెహబూబ్ ఆధ్వర్యంలో పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రి లో పేషంట్స్ కు అన్నదానం చేయడం జరిగింది..ఈ సందర్భంగా షేక్ మెహబూబ్ మాట్లాడుతూ కుక్కల రాజు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుణ్ణి కోరారు..ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ దస్తగిరి(చోటు), బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు అబ్బు అలి ఖురేషి,రిపోర్టర్లు నరేష్,సంతోష్ గుప్తా,నవీన్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు..




## రాయికల్ పట్టణ యూత్ కాంగ్రేస్లో కి యూవత రావాలి రివ్యూ మీటింగ్ లో జిల్లా కాంగ్రెస్ పార్టీ యువత అధ్యక్షుడు బిరమ్ రాజేష్

**రాయికల్ మండలం ఆగస్టు04( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యం లో రివ్యూ మీటింగ్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పార్టీ బలోపేతం లో యువత ముందు ఉండాలని , ప్రతి యువత రాజకీయం లోకి రావాలని , కాంగ్రెస్ పార్టీ యువత కి మంచి అవకాశాలు కల్పిస్తుంది అని , మరియు పట్టణ యూత్ కమిటీ నియమకాలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు ఈకార్యక్రమంలో జిల్లా యూత్ ప్రెసిడెంట్ బీరం రాజేష్,జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ బలుస సాయి,అసెంబ్లీ యూత్ ప్రెసిడెంట్ కర్నె భూమా రెడ్డి,రాయికల్ పట్టణ యూత్ నాయకులు అల్లె పురుషోత్తం,అనుమల్ల చింటూ,కాశిరెడ్డి సంజీవ్,మోర చైతన్య,గుండేటి రూపేష్,నరంశెట్టి మనోజ్,గట్టు బంటు, సింగని వరుణ్,శ్రీరాముల సాయి,పడిగెల నరసింహ, కొత్తపెల్లి అరవింద్, శివ,శ్రీకాంత్, సాయి,హరీష్,జలపతి,మధు,యూత్ నాయకులు పాల్గొన్నారు.



## రాయికల్ లో మ్యాకల గంగాధర్ మరణిస్తే ఆ కుటుంబాన్ని పరివర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ మండలం ఆగస్టు,04( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ లు మ్యాకల కాంతారావు,మ్యాకల రమేష్ ల సోదరుడు మ్యాకల గంగాధర్ మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరి వెంట సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు,పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్, సర్పంచ్ బెజ్జంకి మోహన్,నాయకులు గంద్ర అచ్యుతరావు,గన్నే రాజారెడ్డి,సుదవేణి మురళి,సింగని రమేష్, రాయికల్ మున్సిపల్ మాజీ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు,మాజీ సర్పంచ్ తంగేళ్ల రమేష్,మొఖిద్,తిరుపతి గౌడ్,నిమ్మల శేఖర్,విజయ్, తదితరులు ఉన్నారు. అలాగే జగిత్యాల్ అర్బన్ మండలం మోతే గ్రామంలో ఐదవ తేదీ బుధవారం నాడు మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు ఆహ్వాన పత్రికను అందజేసిన మోతె నాయకులు ప్రజలు



## అందోల్ కుమ్మరిగూడెం 6వ వార్డు ఎస్సీ కాలనీలో అంగరంగ బోనాల పండుగ సంబరాలు.





**అందోల్ ప్రతినిధి ఆగస్టు 4(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

అందోల్ కుమ్మరిగూడెంలో 6వ వార్డు ఎస్సీ కాలనీలో అంగరంగ వైభవంగా బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు పోతురాజుల విన్యాసాలు పోచమ్మ గుడి వద్దకు బోనాలు చేరి భక్తులు మొక్కుని అమ్మవారి దీవెనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాణ్యం ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాగేంద్ర



**ఓర్వకల్లు ప్రతినిధి, ఆగస్టు 04(పబ్లిక్ న్యూస్)**

ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామం టిడిపి కార్యకర్త నాగేంద్ర మాట్లాడుతూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఇంకెన్నో జరుపుకోవాలని ఆ దేవున్ని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను, ఏ చిన్న సమస్య వచ్చినా గౌరు వెంకట్ రెడ్డి కి ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తారు, అర్ధరాత్రి అయినా ఫోన్ చేస్తే సమస్య ఏది అని అడిగి వెంటనే అతల వాళ్ళకు ఫోన్ చేసి మాట్లాడి సమస్యని పరిష్కరిస్తాడు గౌరు కుటుంబం అంటే పేదలకు పనిచేసే కుటుంబ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి మంత్రి పదవి రావాలని అందరి దేవుళ్ళని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను తెలిపారు..

## బర్రెలు లేకుండా షెడ్డు కు పేమెంట్ చేసిన టెక్నికల్ అసిస్టెంట్

**ఆందోల్ ప్రతినిధి ఆగస్టు 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

అందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో గతంలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బర్రెలు ఆవులు లాంటి పశువులు ఉన్నవారికి షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం చేసే పథకంలో స్థానికంగా వెలుగోలోకి వచ్చిన కథనం అల్మాయిపేట గ్రామంలో బేగరి మల్లేశం వాళ్ల భార్య పేరు మీద బర్ల షెడ్డు కు అనుమతి ఇవ్వడం జరిగింది గ్రామములో ఎంతో మందితో పశువులు ఉన్నప్పటికీ కొంతమంది రైతులు మాకు కావాలి మేము నిర్మించుకుంటాం షెడ్లను అన్నప్పటికీ వాటికి సహకరించకుండా గ్రామానికి టెక్నకల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సర్దార్ సింగ్ బేగరి మల్లేశం అనే వ్యక్తికి అతని దగ్గర ఎలాంటి బర్లు లేకున్నా షెడ్డు కు అనుమతి ఇచ్చి ఆ షెడ్డు కు సంబంధించిన చెక్కును కూడా ఇవ్వడం జరిగింది అంటే అధికారులు




ప్రభుత్వం బర్రెలు ఉంటేనే షెడ్డులు నిర్మించుకోవాలని గట్టి నిబంధనలు ఉన్నప్పటికీ అవేవీ కాకుండా ఇక్కడ ఉన్నటువంటి ఈ మండలాధికారి డబ్బులకు ఆశపడో మరి దేనికి ఆశపడు ఆ షెడ్ కు అనుమతించి షెడ్డు కు డబ్బులు వచ్చేలా పనిచేయడం తీరును చూస్తే చాలా




ఆశ్చర్యమేస్తుంది వెంటనే ఈ అధికారి పైన చర్యలు తీసుకొని విధులనుంచి తొలగించి గ్రామంలో ఏ షెడ్డు కైతే అనుమతి ఇచ్చి షెడ్డు కు చెక్కును అందజేశాడు ఆ ఇచ్చిన డబ్బులను ప్రభుత్వం రికవరీ చేసి ప్రభుత్వానికి సహకరించాలని గ్రామస్తుల విన్నపం

## ఆగస్టు 6 నుండి 15 వరకు జరిగే సీపీఐ పాదయాత్రలను జయప్రదం చేయండి

### సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 4)**

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి పిలుపు మేరకు, "మార్పు కావాలి" అనే నినాదంతో ఆగస్టు 6 నుండి 15 వరకు నిర్వహించే పాదయాత్రలను విజయవంతం చేయాలని సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పిలుపునిచ్చారు.

స్థానిక సీఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించబడినట్లు ఆరోపించారు. మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం, ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం వంటి చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం




నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని అన్నారు.

దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయికి చేరుకుందని, పరీక్షా పత్రాల లీకులతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నారు. మహిళలు, ఆదివాసీల భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల్లో చైతన్యం కల్పించి మార్పు అవసరాన్ని తెలియజేయడానికి జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు.

అలాగే ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తగిన వర్షపాతం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వేసిన పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలయ్యారని అన్నారు. కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని, రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరారు.

ఈ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 18న వేలాది మంది రైతులతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు, సెప్టెంబర్ 1న "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణారెడ్డి, కె. శ్రీనివాసులు, జిల్లా సమితి సభ్యుడు సి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి: వైఎస్సార్‌సీపీ

### మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ -అక్రమ అరెస్టులు, కేసులపై పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 4)**

రాష్ట్రంలో డీఎస్సీ నియామకాల ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వాటిపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డీఎస్సీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా కింద పోస్టుల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. డీఎస్సీ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కేంద్రంలో నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటన విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిందని, అలాగే




రాష్ట్రంలో డీఎస్సీ నియామకాల విషయంలో కూడా అభ్యర్థులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. కర్నూలు జిల్లాలో కూటమి ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేసి ఎమ్మెల్యే విరూపాక్షిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని ఆరోపించారు.

డీఎస్సీ అవకతవకలు, అక్రమ అరెస్టులపై వైఎస్సార్‌సీపీ నిరంతర పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం




చేశారు. అనంతరం డీఎస్సీ అక్రమాలు, అక్రమ కేసులకు వ్యతిరేకంగా రూపొందించిన ఏపీ జనజాగరణ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ కార్పొరేటర్ సత్యనారాయణమ్మతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో విద్యా రంగం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

### పాఠశాల డ్రాప్‌అవుట్‌లను తగ్గించి విద్యార్థుల నమోదు పెంచాలి

### విద్యార్థుల భవిష్యత్తే సమాజ అభివృద్ధికి పునాది : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 4)**

జిల్లాలో విద్యా రంగానికి సంబంధించిన కీలక సూచికల్లో గణనీయమైన పురోగతి సాధించేలా అన్ని శాఖల అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు), ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ప్రతి అధికారిపై ఉందని, అదే సమాజ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో విద్యా నాణ్యత, కీలక సూచికల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులు, స్టేక్‌హోల్డర్లతో నిర్వహించిన హై లెవల్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య, యువత, మానవ వనరుల అభివృద్ధికి ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, అదే దిశగా జిల్లాలో విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల ప్రవేశాలు, అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ గుర్తింపు ప్రక్రియను వారం రోజుల్లోగా 100 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి మండల విద్యాశాఖ అధికారి తన పరిధిలోని పాఠశాలలను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, పనితీరు తక్కువగా ఉన్న ప్రధానోపాధ్యాయులను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. విద్యా రంగంలో నిర్లక్ష్యం సహించబోమని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై అవసరమైతే పరిపాలనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో బాలికల డ్రాప్‌అవుట్‌లు అధికంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసిన కలెక్టర్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు (కేజీబీవీ) అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో అదనపు వసతుల అవసరం ఉందన్నారు. జిల్లాకు అదనంగా 12 కేజీబీవీలు, 5 బీసీ హాస్టళ్లు, 5 ఎస్సీ హాస్టళ్లు, 5 ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు, 100 సీజనల్ హాస్టళ్లు, 10 ఏపీ మోడల్ స్కూళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.వలస వెళ్లే కుటుంబాల పిల్లలు విద్యకు దూరం కాకుండా ఉండేందుకు సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసి, ఆగస్టు 15 నాటికి వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వలసల కారణంగా ఒక్క విద్యార్థి కూడా చదువు మానకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.జిల్లాలో పాఠశాల డ్రాప్‌అవుట్‌లను 5 శాతం లోపే పరిమితం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రధానోపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరచాలని, మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉన్న పాఠశాలలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుంచి 9.30 గంటలలోపు హాజరు వివరాలను నమోదు చేసి ప్రధాన కార్యాలయానికి పంపించాలని సూచించారు. ముఖ్యంగా సి.బెళగల్, ఎమ్మిగనూరు, కౌతాళం, కల్లూరు, కోసిగి, కర్నూలు అర్బన్, ఆలూరు, చిప్పగిరి మండలాల్లో ఉపాధ్యాయుల హాజరు 100 శాతం నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జీఎఫ్ఎల్ పాఠశాలల కవరేజ్ తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నమోదు పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల మౌలిక వసతులకు సంబంధించిన వివరాలను లీప్ యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేసి రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేసిన కలెక్టర్, మెనూ ప్రకారం అందిస్తున్న భోజన వివరాలను ప్రతిరోజూ తల్లిదండ్రుల వాట్సాప్ గ్రూపుల్లో పంచుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలు, విద్యా కార్యకలాపాల వివరాలను తల్లిదండ్రులకు చేరవేసేందుకు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు.మండల స్థాయి అధికారులు పాఠశాలలను తరచూ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. అలాగే పాఠశాలల్లో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్.ఓ. ప్లాంట్ల పనితీరుపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి, పనిచేయని ప్లాంట్లను అత్యవసరంగా మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

# రైతులకు శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి ప్రభుత్వ లక్ష్యం -రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి**

**ప్రస్తుత పరిస్థితుల్లో వరి కంటే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు04 (రిపబ్లిక్ న్యూస్)** రాయలసీమ ప్రాంత సమగ్ర అభివృద్ధితో పాటు సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గోరుకల్లు జలాశయానికి గతంలో చేపట్టిన పనులను ప్రస్తుతం మరింత బలోపేతం చేస్తూ రూ. 53 కోట్లతో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టినట్లు తెలిపారు. రిజర్వాయర్‌లో లీకేజీల నివారణ కోసం రూ. 54 కోట్లతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అలగనూరు రిజర్వాయర్‌కు గతంలో ప్రతిపాదించిన మరమ్మతుల కంటే ప్రస్తుతం విస్తృత స్థాయిలో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. శ్రీశైలం, గోరుకల్లు, అలగనూరు తదితర సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు, అభివృద్ధి కోసం రూ. 610 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాయలసీమకు కృష్ణా జలాలను సమర్థవంతంగా అందించేందుకు అవుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, హంద్రీ-నీవా, గండికోట, ఎస్ఆర్‌బీసీ వంటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 2024-25 సంవత్సరంలో గండికోటకు 60 టీఎంసీలు, ఎస్ఆర్‌బీసీకి 7 టీఎంసీల నీటిని అందించామని, 2025-26లో కూడా ఎస్ఆర్‌బీసీకి 6 టీఎంసీల నీటిని విడుదల చేసి సాగుతో పాటు పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరాను కూడా కొనసాగిస్తున్నామని తెలిపారు. దీంతో పరిశ్రమలు, సిమెంట్ కర్మాగారాల అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై గత రెండేళ్లలో రూ. 12,484 కోట్లు ఖర్చు చేశామని, 2026-27 బడ్జెట్‌లో మరో రూ. 10,014 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాబోయే మూడేళ్లలో రూ. 35,313 కోట్లతో 36 ప్రాధాన్యత ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, వాటిలో 14 ప్రాజెక్టులు రాయలసీమకు చెందినవేనని వివరించారు. రాయలసీమ హార్టీకల్చర్ కోసం లక్ష కోట్ల రూపాయలతో ప్రాజెక్టు తయారవుతోందన్నారు. తుంగభద్ర గేట్లను 5 రోజుల్లో బిగించి 30 టిఎంసిల నీటిని కాపాడడం జరిగిందని మంత్రి వివరించారు. జిల్లాలో డ్రోన్ హబ్, గోరుకల్లు దగ్గర ఇండస్ట్రియల్ హబ్... అనేకమైన పరిశ్రమలు వస్తున్నాయని, బనగానపల్లె నియోజకవర్గంలో అల్ట్రాటెక్ సెకండ్ యూనిట్ ను దాదాపుగా 4,000 కోట్లతో కొలిమిగుండ్లలో ఏర్పాటు చేస్తున్నామని, రామ్కో విస్తరణ కూడా చేపట్టడం జరుగుతోందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, శ్రీశైలం జలాశయం పూర్తి సామర్థ్యం 885 అడుగులు (215 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా 860 అడుగుల (105 టీఎంసీలు) వరకు నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో ఏడాది పొడవునా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగించేందుకు సుమారు 9 టీఎంసీల నీరు అవసరమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నింపి తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రస్తుతం వరి సాగుకు అవసరమైనంత సాగునీరు అందుబాటులో లేకపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు నష్టపోకుండా మినుము, కంది, పెసర, జొన్న, కొర్రలు, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులందరూ తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఏ గ్రామానికీ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, ఏ రైతుకూ ఇబ్బందులు కలగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు.

## మండలి వెంకట కృష్ణా రావు జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన జిల్లా రెవెన్యూ అధికారి

**ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేసిన ప్రముఖ ప్రజానాయకుడు : జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు0 4 (రిపబ్లిక్ న్యూస్ ):** సామాజిక సేవా దృక్పథంతో ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేసిన ప్రముఖ ప్రజా నాయకుడు మండలి వెంకట కృష్ణారావు అని జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మండలి వెంకటకృష్ణారావు జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ మాట్లాడుతూమండలి వేంకట కృష్ణారావు కృషి వల్లే దివిసీమలోని నిరుపేదలకు బంజరు భూములను పంచే కార్యక్రమం 1955లో ప్రారంభించడం జరిగిందన్నారు. 15 వేల ఎకరాల బంజరు భూములను పేదలకు పంచారని, 1974 లో ఆయన విద్యా సాంస్కృతిక వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారనీ తెలిపారు. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల కార్యనిర్వాహక అధ్యక్షులుగా వ్యవహరించారన్నారు. అంతర్జాతీయ తెలుగు కేంద్రం ప్రథమ అధ్యక్షులుగా వ్యవహరించిన మండలి వేంకట కృష్ణారావు కృషిని గుర్తించి దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి అంత ర్జాతీయ తెలుగు కేంద్రం పేరును మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం గా మార్చారన్నారు. దివిసీమ లోని పులిగడ్డ పెనుమూడి వంతెనకు మండలి వేంకట కృష్ణారావు పేరు పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి సునిల్ కన్నా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**వికసిత భారత్‌గ్రామ్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలి**

**లివీ బీ జీ రామ్ జీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు0 4 (రిపబ్లిక్ న్యూస్ ):** వీ బీ జీ రామ్ జీ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి నుంచి వి హెచ్ డి ప్లాంటేషన్, వి బి జి రామ్ జి కార్యక్రమంపై అమలపై ఎంపీడీవోలు, పీడి డ్వామా, విద్యాశాఖ అధికారులు, ఎ పి డి , ఎ పి ఓ ల తో నిర్వహించిన జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి జీవనోపాధి మెరుగుదల, పర్యావరణ పరిరక్షణ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హరితాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటడం, విబీ జీ రామ్ జీ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జ (వి బి జి రామ్ జి ) పథకం కింద వేతన కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, కూలి చెల్లింపులను సకాలంలో అందించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 100 వేతన కార్మికులకు అవగాహన కల్పించడంతో పాటు వారికి పని దినాలను పెంచి వారి జీవనోపాధికి తోడ్పడాలని తెలిపారు. జిల్లాలో ( వి బి జి రామ్ జి ) కింద చేపట్టిన పనులను అన్ని సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, రహదారుల వెంట, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, చెరువుల పరిసర ప్రాంతాలు మరియు ఇతర అనువైన ప్రదేశాల్లో స్థానిక వాతావరణానికి అనుకూలమైన మొక్కలను నాటాలని తెలిపారు. వీ బీ రామ్ జీ పథకం కింద ఉద్యాన తోటల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రజల భాగస్వామ్యంతో మొక్కల పెంపకాన్ని ఒక ఉద్యమంలా నిర్వహించాలని, పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించాలన్నారు. ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లు వీ బీ రామ్ జీ పథకం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుక






**నంద్యాల క్రైం, ఆగస్టు 4, (రిపబ్లిక్ న్యూస్):** నిజాయితీ, అంకితభావంతో తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేసిన ప్రముఖ విద్యావేత్త, రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జయంతి వేడుకను నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా భావించి జీవితాంతం ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసిన ఉన్నతమైన వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు. రాజకీయాల్లో నిజాయితీ, నిబద్ధత, విలువలు పాటించిన గొప్ప వ్యక్తి, ఉన్నత పదవుల్లో ఉన్నా సామాన్యుడిలా జీవిస్తూ ప్రజలకు సేవ చెయ్యడం పరమావదిగా భావించి నేటి రాజకీయ నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మాట్లాడుతూ దివిసీమ ఉప్పెన సంభవించిన సమయంలో బాధితులను ఆదుకోవడంలో ముందుండి సేవలందించిన ఆయన, వేలాది కుటుంబాలకు అండగా నిలిచారని, ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా "దివిసీమ గాంధీ" అనే బిరుదును పొందారన్నారు. ఈ కార్యాక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఖాదర్ బాష ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, డీపీఓ అధికారులు వీరన్న ,ఖాదర్ బాషా, కవిత, రిజర్వు ఇన్స్పెక్టర్లు బాబు, విజయ్, సురేష్ ఆర్ఎస్ఐ హర్షవర్ధన్ రెడ్డి, చరణ్ లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్ పథకం అమలును వేగవంతం చేయాలి

**ఆన్‌లైన్ ప్రక్రియలు, ఇన్‌స్టాలేషన్లు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 04 (రిపబ్లిక్ న్యూస్):** పీఎం సూర్య ఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియలు, సోలార్ యూనిట్ల ఇన్‌స్టాలేషన్ పనులను వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎపిఎస్పీడిసిఎల్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో పథకం అమలు పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సోలార్ యూనిట్ల ఏర్పాటు కోసం అవసరమైన మెటీరియల్ అందిన అన్ని లబ్ధిదారుల వద్ద ఈ నెల 8వ తేదీ నాటికి ఇన్‌స్టాలేషన్ పనులు పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సుమారు 5,000 ఇన్‌స్టాలేషన్‌లకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉన్నందున వాటి ఏర్పాటు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పథకం అమలులో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, అర్హులైన లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వ పథకం ప్రయోజనాలను సకాలంలో పొందేలా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎపిఎస్పీడిసిఎల్ ఎస్ఈ సుధాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నంద్యాల లయన్స్ క్లబ్, ఐఎంఏ మహిళా విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు

**. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన సదస్సు - తల్లులకు, గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించిన ప్రసూతి వైద్యులు,చిన్నపిల్లల వైద్యులు**

**- నెరవాటి ఆసుపత్రి సౌజన్యంతో పండ్లు, బ్రెడ్లు పంపిణీ - తల్లిపాల ప్రాముఖ్యతపై కరపత్రాల ఆవిష్కరణ**




**నంద్యాల ఆగస్టు 4 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల లయన్స్ క్లబ్,ఐఎంఏ మహిళా విభాగం సంయుక్త నిర్వహణలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి తల్లీ బిడ్డల ప్రత్యేక విభాగంలో మంగళ వారం తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన,నెరవాటి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ వినోద్,డాక్టర్ నెరవాటి అరుణ కుమారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మజ, చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర,ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, లయన్స్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ జి.రవికృష్ణ అతిధులుగా పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టత పై డాక్టర్ అరుణ కుమారి,డాక్టర్ పద్మజ , నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాజ్యలక్ష్మి,డాక్టర్ సుధా వాణి,డాక్టర్ వసుధ, ఐఎంఏ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య,నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, నంద్యాల మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ సునీత, డాక్టర్ రజని,డాక్టర్ ఫాతిమా,డాక్టర్ నిత్య, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ తనూజ, డాక్టర్ అనూష గర్భవతులకు,చంటి బిడ్డల తల్లులకు తల్లిపాల వల్ల వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ తల్లిపాల విశిష్టత పై గత 20 సంవత్సరాలుగా ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.లయన్స్ క్లబ్ కార్య దర్శి మేడా చంద్రశేఖర్,కోశాధికారి సురేష్, జోన్ చైర్మన్ సోమేశుల నాగరాజు, సంయుక్త కార్యదర్శి అమిదేల జనార్ధన్, సభ్యులు పాలూరు ప్రశాంత్, కిరణ్, జగన్,తదితరులు పాల్గొని 200 మంది గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా తల్లీ పాల ఆవశ్యకత గురించి రూపొందించిన కర పత్రాలు విడుదల చేసి తల్లులకు గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేశారు.

## హజ్-2027 యాత్ర కోసం 2830 దరఖాస్తులు

**ఏపీ నుంచి ఎంపికైన 2792 మంది హాజీలు**

**విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంకు "రెట్టింపు" స్పందన**

**గన్నవరం నుండి వెళ్లేందుకు 637 మంది దరఖాస్తు**

**షార్ట్ హజ్ కోసం 460 మంది దరఖాస్తు**

**కూటమి ప్రభుత్వం చర్యలతో భారీగా పెరిగిన హజ్ యాత్రికుల సంఖ్య**

**రాష్ట్ర మైనారిటీ సంక్షేమ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**అమరావతి ఆగస్టు 04 (రిపబ్లిక్ న్యూస్ ) :** పవిత్ర హజ్-2027 యాత్ర కోసం రాష్ట్రం నుండి 2830 మంది యాత్రికులు గడువు ముగిసే నాటికి ఆన్ లైన్ లో కేంద్ర హజ్ కమిటీకి దరఖాస్తు చేసుకున్నారని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఇందులో 2792 మంది అర్హత పొందారని అమరావతి లో మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. సౌదీ అరేబియా ప్రభుత్వంతో కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం మేరకు భారత దేశానికి కేటాయించిన మొత్తం హజ్ కోటా 1,75,025 కాగా, ఇందులో హజ్ కమిటీ ఆఫ్ ఇండియాకు 1,22,518, ప్రైవేటు టూర్ ఆపరేటర్లకు 52,507 సీట్లు కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా లాటరీ విధానంలో ఎంపిక చేసిన వారిలో ఏపీ నుండి సరిగా దరఖాస్తు చేసుకున్న 2792 మంది ఉన్నారని మంత్రి తెలిపారు. ఎంపికైన వారందరూ మొదటి విడతగా రూ. 1,52,300 మొత్తాన్ని ఈనెల 10 వ తేది లోపు చెల్లించాల్సి ఉందన్నారు. చెల్లించిన మొత్తానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం, ఆన్ లైన్ దరఖాస్తు కాపీ, స్క్రీనింగ్ సర్టిఫికెట్, ఇటీవల తీయించుకున్న పాస్ పోర్ట్ సైజు ఫోటో, నివాస ధ్రువీకరణ పత్రం నకలు,పాస్ పోర్ట్ మొదటి, చివరి పేజీల నకలు, బ్యాంకు పాస్ బుక్కు లేదా క్యాన్సిల్ చేసిన చెక్కు నకలు కాపీలకు సంబంధించిన సెట్ ను విజయవాడ లబ్బీపేట లోని రాష్ట్ర హజ్ కమిటీకి సమర్పించాలని మంత్రి ఫరూక్ సూచించారు. దరఖాస్తుదారులకు ఏదైనా సమాచారం అవసరమైనా, సందేహాలు ఉన్నా టోల్ ఫ్రీ నంబరు 1800-425-7873 కు లేక ఈమెయిల్ అడ్రస్: aphajcommittee@gmail.com లేక రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని మంత్రి పేర్కొన్నారు.

**విజయవాడ నుంచి "రెట్టింపు" దరఖాస్తులు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం తీసుకున్న మైనారిటీ సంక్షేమ చర్యలతో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చిన హాజీల సంఖ్య భారీగా పెరిగిందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుండి నుంచి వెళ్లే వారికి రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రకటించడమే కాకుండా, గన్నవరం నుండి వెళ్లి విజయవంతంగా యాత్ర పూర్తి చేసుకుని వచ్చిన వారందరికీ హామీ మొత్తాన్ని నేరుగా వారి అకౌంట్ లకు జమ చేయడం జరుగుతుండడంతో ప్రభుత్వం పై హాజీల నమ్మకం రెట్టింపు అయిందన్నారు. హజ్ -2026 యాత్ర కు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎన్నుకొని యాత్ర పూర్తి చేసిన 331 మంది హాజీలకు రూ. 3.31 కోట్లు మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశామన్నారు. రాష్ట్రం నుండి హజ్ - 2027 యాత్ర కోసం గడువు ముగిసే నాటికి 2830 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 460 మంది షార్ట్ హజ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఉన్నారని మంత్రి ఫరూక్ తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ను మొదటి ప్రాధాన్యత కేంద్రంగా మొత్తం 637 మంది హాజీలు ఎన్నుకున్నారని తెలిపారు. 2026 హజ్ యాత్ర లో గన్నవరం నుండి 331 వెళితే,2027 హజ్ యాత్ర కు రెట్టింపు సంఖ్యలో గన్నవరంను యాత్రికులు ఎంచుకోవడం జరిగిందన్నారు. మైనారిటీల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న సంక్షేమ విధానాలు, గన్నవరం నుంచి వెళ్లే ప్రయాణికులకు అన్ని మౌళిక సదుపాయాలు, సహకారం అందించడమే ఇందుకు ప్రధాన కారణమని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. హజ్- 2027 యాత్రకు రాష్ట్రం నుంచి గుంటూరు, కర్నూలు, అన్నమయ్య జిల్లాల నుండి అత్యధికంగా, శ్రీకాకుళం, కోనసీమ, అనకాపల్లి జిల్లాల నుండి అత్యల్పంగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విజయవాడ నుండి వెళ్లే ప్రతి హజ్ యాత్రికునిపై అదనపు ఛార్జీల భారం పడకుండా రూ. లక్ష ఆర్థిక సాయం ను కూటమి ప్రభుత్వం అందజేస్తుందని, హజ్ కు వెళ్లే వారంతా ఈ అవకాశాన్ని మున్ముందు ఇంకా ఎక్కువ సంఖ్యలో ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలనిమైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.విజయవాడ కేంద్రాన్ని తమ మొదటి ప్రాధాన్యత కేంద్రంగా ఎన్నుకుంటే ప్రభుత్వం నుండి రూ.లక్ష ఆర్థిక సహాయంతో పాటు,యాత్రకు అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం నుండి పగడ్బందీగా పొందడానికి వీలవుతుందని, రాష్ట్రానికి ఒక ప్రత్యేక గుర్తింపు కూడా లభిస్తుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com